ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

ఆదివారం 22.11.2026 | సంపుటి:13 సంచిక:122 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



తెలంగాణకు ఏరోస్పేస్ రంగంలో

మరో భారీ పెట్టుబడి

రూ.4000 కోట్లతో ముందుకొచ్చిన 'సఫ్రాన్'

- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో ఎంఓయూ కుదిరే అవకాశం
- ఫ్రాన్స్‌లోని సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ భారీ పెట్టుబడి ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో ఏరోస్పేస్, విమాన విడిభాగాల తయారీ రంగాలకు మరింత ఊతం లభించనుంది. డిసెంబర్ 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ పెట్టుబడికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉంది.ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా శనివారం పారిస్ సమీపంలోని ఎవ్రీ-కార్బెల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, ఇప్పటికే కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లను సరఫరా చేస్తున్న సఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి కీలక పరిణామం. హైదరాబాద్‌లో సఫ్రాన్ సంస్థ ఇప్పటికే గణనీయమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

మిగతా 2లో..



తెలంగాణ ఎగుమతులు

భేష్..

- ఈ వృద్ధి కేవలం ఆరంభం మాత్రమే
- మూడేళ్లతో పోలిస్తే 68 శాతం పెరిగాయి
- హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



కాళోజీ కళాక్షేత్రం


కళా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకే..

- హనుమకొండ కలెక్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- అక్కడికి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారనే వార్తలపై స్పందించిన ముఖ్యమంత్రి

వివరాలు 2వ పేజీలో..

ఉక్రెయిన్‌పై ఉరిమిన

రష్యా



ఏకంగా 400కుపైగా డ్రోన్లు, 110కుపైగా క్షిపణుల ప్రయోగం

ఉక్రెయిన్‌పై రష్యా రష్యా సేనలభీకర దాడిలో దెబ్బతిన్న ఓ భవనం

- వీటిలో 27 బాలిస్టిక్ క్షిపణులని ఉన్నాయి
- దాడుల్లో 8 మంది పౌరులు మృతిచెందారు
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- ఉక్రెయిన్‌కు నిధులివ్వొద్దు..
- యూరప్ దేశాలకు డోనాల్డ్ ట్రంప్ సూచన

కీవ్(జనంసాక్షి): ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. 400 కుపైగా డ్రోన్లు, 110కుపైగా క్షిపణులను ప్రయోగించిందని, వీటిలో 27 బాలిస్టిక్ క్షిపణులని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. దాడుల్లో కనీసం ఎనిమిది మంది పౌరులు మరణించగా, రెండు డజన్లకుపైగా గాయపడ్డారని కొన్ని క్షిపణుల్లో విశాల ప్రాంతంలో డజన్ల కొద్దీ చిన్న బాంబులను వెదజల్లే క్లస్టర్ వార్‌హెడ్‌లు ఉన్నాయని తెలిపారు. ఉక్రెయిన్‌పై దాడుల క్రమంలో రష్యాకు చెందిన ఖెచ్-101 క్షిపణి శుక్రవారం పోలండ్‌లో పడింది. ఉక్రెయిన్‌లో యుద్ధానంతర సైనిక మిషన్‌కు సిద్ధమవుతున్న యూరోపియన్ దళాల కసరత్తుల సమయానికే ఈ ఘటన జరగడం ఉద్దేశపూర్వక రెచ్చగొట్టుడు చర్య అయి ఉండవచ్చని పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ అన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాదాపు ఐదేండ్లుగా పూర్తిస్థాయి దండయాత్రతో ప్రారంభించిన యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంలో చర్చలకు వేగం పెంచే ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఈ ఘటన యూరప్, రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. 'ఇది రష్యా ఉద్దేశపూర్వకంగా చేసిన రెచ్చగొట్టుడు చర్యగా కనిపిస్తున్నది' అని టస్క్ చెప్పారు. ఉక్రెయిన్ సరిహద్దుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఖెచ్-101 క్షిపణి పడిందని పోలండ్ రక్షణ శాఖ తెలిపింది.

ఉక్రెయిన్‌కు నిధులివ్వొద్దు.. యూరప్ దేశాలకు ట్రంప్ సూచన

ఉక్రెయిన్‌కు యుద్ధం కోసం నిధుల సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరప్ దేశాలను కోరినట్టు ది ఇండిపెండెంట్ కథనం వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడిన కొన్ని

మిగతా 2లో..

నేను చెప్పాను.. జనం బంగారం కొనడం మానేశారు..

అందుకే పసిడి ధరలు తగ్గాయి

ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):బంగారం ధరలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొన్ని నెలల క్రితం తాను చేసిన విజ్ఞప్తి మేరకు దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లను నిలిపివేశారని, ఇప్పుడు ధరలు తగ్గాయని అన్నారు. తన మాట విన్న ప్రజలు డబ్బును ఆదా చేసుకోగలిగారని చెప్పారు. ఒక్క ఏడాది పాటు అవసరం లేకపోతే బంగారం కొనవద్దని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది పాటించిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని.. ఆ సలహాతో తమ డబ్బు ఆదా అయిందని తనతో చెబుతున్నారని వివరించారు. లఖ్‌నవూలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ విధంగా మాట్లాడారు."అవసరం లేకపోతే ఓ ఏడాది పాటు బంగారం కొనకుండా ఉండాలని కొన్ని నెలల క్రితం దేశ ప్రజలకు సూచించా. రోజుకు ఒకపూట భోజనం మానేయాలని గతంలో లాల్ బహదూర్ శాస్త్రి విజ్ఞప్తిని పాటించిన ఈ దేశ ప్రజల స్వభావం ఈనాటికీ అలాగే ఉండటం సంతోషాన్ని కలిగిస్తోంది. నాలాంటి సాధారణ వ్యక్తి చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని తక్కువ బంగారం కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటి ధరలు తగ్గాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులతో బంగారం ధరలు పెరుగుతున్నాయని.. ఏడాది పాటు కొనుగోళ్లను నిలిపివేద్దామని ఈ ఏడాది మేలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పండుగలు, శుభకార్యాలైనా దానిపై ఆసక్తి చూపించొద్దని సూచించారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు

మిగతా 2లో..

పేద ప్రజలను శక్తిమంతం చేశాం

- గత 13 ఏళ్లలో 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు
- ఈ విషయం స్వయంగా ప్రపంచ బ్యాంక్ నివేదికనే తెలిపింది
- దేశాభివృద్ధిలో, ఆవిష్కరణ రంగంలో ఐఐటీ- ఖరగ్‌పుర్ కీలక పాత్ర పోషిస్తోంది
- సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తిని నేను: ప్రధాని మోదీ

2లో

నీతీశ్ సేతు వంతెనను ప్రారంభించిన ప్రధాని



పరిశ్రమలశాఖకు కనీసం సెక్రటరీనే లేడు..

ఇక ఇండస్ట్రీలను ఎలా ఆకర్షిస్తారు? • పెట్టుబడులను ఎలా తెస్తారు? తుఫాన్ ముప్పు పొంచి ఉంది.. • కల్లాల్లో ఉన్న వడ్లను వెంటనే కొనాలి • తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హరీశ్ రావు



హైదరాబాద్(జనంసాక్షి):ఖైరతాబాద్‌లో మన పార్టీ మాద గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేసింది.. రేపో మాపో ఎన్నికలు రాబోతున్నాయి.. ఈ సమయంలో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ దుకాణం ఖాళీ అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.. ఇది బీఆర్ఎస్ గెలుపునకు ఒక గొప్ప సూచిక అని అన్నారు.సోమాజిగూడ డివిజన్ యువ నాయకుడు మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో త్రినాథ్‌తోపాటు పలువురు కార్యకర్తలు మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈ మధ్య రాష్ట్రంలో ఎవరూ సర్వే చేయించినా.. రేవంత్ రెడ్డి చేయించుకున్నా.. ఏజెన్సీలు చేసినా..

మిగతా 2లో..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

2లో



23న కొత్త ఇన్‌ఛార్జ్‌ను

కలవండి

- సందీప్‌తో సమావేశం కావాలని రాజగోపాల్‌రెడ్డికి ఏఐసీసీ కార్యదర్శి ఆదేశం
- కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువైంది
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిస్తోంది
- పీసీసీ అధినేత మహేశ్‌కుమార్ గౌడ్


హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఫోన్ కాల్ వచ్చింది. ఈ నెల 23న కొత్త ఇన్‌ఛార్జ్ సందీప్‌తో సమావేశం కావాలని ఏఐసీసీ కార్యదర్శి సూచించారు. మరోవైపు

మిగతా 2లో..

వారం క్రితమే ఉద్యోగం.. అంతలోనే అనంతలోకాలకు..

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలంగాణ యువకుడి మృతి





ముసుగోడు(జనంసాక్షి): నల్గొండ జిల్లా మునుగోడు పట్టణానికి చెందిన యువకుడు అమెరికాలో మృతి చెందాడు. ఈరమళ్ల ప్రసాద్, శ్రీకన్య దంపతుల పెద్ద కుమారుడైన సాయితేజ (25) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. వారం రోజుల క్రితం అతడికి ఉద్యోగం వచ్చింది. ఈ క్రమంలో

మిగతా 2లో..

మత్తును చిత్తు చేయాలి

2029 నాటికి దేశాన్ని డ్రగ్స్ రహిత భారత్‌గా మార్చాలి

- పంజాబ్‌లో డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేసింది
- హైదరాబాద్‌లో కూడా విచ్చలవిడిగా సరఫరా అవుతోంది
- డ్రగ్ ఫ్రీ ఇండియాకు అందరూ సహకరించాలి: కిషన్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):మన దేశానికి అతిపెద్ద ఆస్తి యువతేనని, కానీ వారు మాదకద్రవ్యాల బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పంజాబ్‌ను డ్రగ్స్ నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా విచ్చలవిడిగా డ్రగ్స్ చలామణి అవుతోందన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన యువత మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మేధావులు, ఐటీ నిపుణులు, యువత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శ్రీసత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'డ్రగ్ ఫ్రీ ఇండియా' మెగా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "హైదరాబాద్‌లో మూతపడిన కొన్ని కంపెనీల్లో డ్రగ్స్ తయారు చేస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పులపైనే గంజాయి మొక్కలను పెంచుతున్నారు.

మిగతా 2లో..

రెండో దశ జనగణనకు

వేళాయే..



- తెలంగాణలో ప్రక్రియకు రంగం సిద్ధం
- డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేసేయండి
- జనగణన నేపథ్యంలో ఉపాధ్యాయులకు కీలక సూచన
- గ్రేటర్ హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో రెండో దశ జనగణనకు రంగం సిద్ధమవు తోంది. దీనిలో భాగంగా 90,000 మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి జనాభా లెక్కల విధుల్లో నియమించనున్నారు.రాష్ట్రంలో కీలకమైన రెండో దశ జనగణనకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే నెలలో సుమారు 90,000 మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తామని, వారిని విధుల్లోకి నియమించాలని జనాభా లెక్కల విభాగం ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. వీరంతా 2027 జనవరి 25 నుంచి మార్చి 1 వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలి.ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు డిసెంబర్ నాటికి మొత్తం సిలబస్‌ను పూర్తి చేయాలి. జనవరిలో మళ్లీ సంక్రాంతి సెలవులు ఉంటాయి. అనంతరం జనవరి 25 నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు జనగణన కోసం క్షేత్రస్థాయికి వెళ్లాలి. మార్చి 1 వరకు

మిగతా 2లో..

ఇలా దాడులు చేస్తే

పెట్టుబడులు ఎలా వస్తాయి

మెటా క్యాంపస్‌పై కాంగ్రెస్ శ్రేణుల దాడి వ్యవహారంపై భారాస మండిపాటు

నేటి నుంచి బాలేన్ షా

ఢిల్లీ పర్యటన

భారత్, నేపాల్ బంధంలో సరికొత్త అధ్యాయం

ఇరుముడిని విమానంలో

తీసుకెళ్లొచ్చు

అయ్యప్ప భక్తులకు కేంద్రం అనుమతి

వివరాలు 2వ పేజీలో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22.11.2026

పరిశ్రమలశాఖకు కనీసం సెక్రటరీనే లేడు..

ఏ పార్టీ సర్వే చేసినా అన్ని సర్వేల్లో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వస్తుందన్నారు. కేసీ ఆర్ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రంలోని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు.ఇండస్ట్రీలను ఆక ర్షిస్తా.. నేను భారత్ సమ్మిట్‌ను పెడతా అం టుండు రేవంత్ రెడ్డి.. అసలు ఈ రాష్ట్రానికి రెండేళ్ల నుంచి పరిశ్రమల కార్యదర్శే లేడు. ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. ఐటీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. చీఫ్ సెక్రటరీని ఇన్‌చార్జ్‌గా పెట్టి నడిపిస్తున్నరు.. ఆ చీఫ్ సెక్రటరీకి సవాలక్ష పనులుంటాయి.. ఆయన ఏం టైం ఇవ్వగలుగుతడు.. ఆయన పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలకు టైం ఇవ్వగలుగుతడా..? ఐటీ కంపెనీలకు టైం ఇవ్వగలుగుతడా..? మీ పాలన ఎట్లుందంటే ఇండస్ట్రీకి, ఐటీకి కనీసం ఒక సెక్రటరీని కూడా అపాయింట్ చేయని పరిపాలన.. మీ కాంగ్రెస్ పాలన. ఇక మీరు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడుతురన్నారు.

మత్తును చిత్తు చేయాలి

మన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. 2029 నాటికి దేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు మనదేశ భవిష్యత్తు బాగుండాలంటే ప్రస్తుతం యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పేర్కొన్నారు. మన దేశ యువతను నాశనం చేసేందుకు విదేశీ శక్తులు కుట్ర చేస్తున్నాయని అందులో భాగంగా సరిహద్దుల్లో ఉండే వారిని డ్రగ్స్‌కు బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సైతం డ్రగ్స్ సరఫరా వెనుక విదేశీ శక్తులు ఉన్నాయని ఆరోపించారు. డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నషా ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన డ్రగ్స్ కేసులెన్ని? ఎంత మందిని అరెస్టు చేశారో వివరాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మణ్‌తో పాటు జయప్రకాశ్ నారాయణ, గరికపాటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే హయాంలో ఈశాన్య ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళ్తోంది

ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, మతపరమైన నమ్మకాలకు ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటాం:అమిత్ షా

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతదేశ చరిత్రను ఎప్పుడు రాసినా.. 2014-2026 మధ్య కాలంలో ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిని సువర్ణాక్షరాలతో లిఖిస్తారని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతానికి మోదీ ప్రభుత్వం ఏమి చేసిందని పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు మాట్లాడే మాటలు నవ్వు తెప్పిస్తుంటాయన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాల కల్పన, విమానాశ్రయాలు, రైల్వే కనెక్టివిటీతో ఈశాన్య ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 11,200 మెగావాట్ల సామర్థ్యం గల 'సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్'కు సంబంధించి ప్రజల్లో ఉన్న ఆందోళనలను త్వరలో తొలగిస్తామన్నారు. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే క్రమంలో.. ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, మతపరమైన నమ్మకాలకు ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటామన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటి నుంచి అక్కడ గణనీయమైన మార్పులు వచ్చాయని అమిత్ షా పేర్కొన్నారు. 35ఏళ్లకు పైగా అశాంతి, హింసాత్మక పరిస్థితులను చూసిన కశ్మీర్ లోయలో ప్రస్తుతం శాంతి నెలకొన్నదని తెలిపారు. ఇప్పుడు ఏ ఒక్క స్థానిక యువకుడికి ఉగ్రవాదంతో సంబంధం లేదన్నారు. కేవలం ఉగ్రవాదులను ఏరివేయడం ద్వారానే కాకుండా.. కశ్మీర్ యువతలో ఉన్న వివక్ష, పరాయీకరణ భావనలను అంతం చేయడం ద్వారా ఈ మార్పు సాధ్యమయ్యిందన్నారు.

నేటి నుంచి బాలేన్ షా ఢిల్లీ పర్యటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా (బాలేన్ షా) ఆదివారం నుంచి దేశంలో అధికారిక పర్యటన చేపట్టనున్నారు. ప్రాంతీయ అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో న్యూదిల్లీ, కాఠ్‌మాండూ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ పర్యటన అత్యంత కీలకంగా మారనుంది. ఈ ఏడాది మార్చిలో నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా బాలేన్ షా సోమవారం రోజు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరపనున్నట్లు భారత విదేశాంగ శాఖ శుక్రవారం రోజు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీతో బాలేన్ సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాల్ని పునరుద్ధరించడానికి ఈ పర్యటన కీలకం కానుంది.ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్ని సమీక్షించడంతో పాటు, పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై మోదీ, బాలేన్ షా అభిప్రాయాల్ని పంచుకోనున్నారు. గతంలో 2023లో అప్పటి నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ భారతదేశంలో పర్యటించారు. ఆ తర్వాత నేపాల్ నుంచి ఒక ప్రధాన మంత్రి భారత్‌కు రానుండటం ఇదే తొలిసారి కావడంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా నేపాల్ దేశంలో కొత్తగా ఎన్నికైన ఏ ప్రధాని అయినా తమ తొలి విదేశీ పర్యటన కోసం భారతదేశాన్నే ఎంచుకునే సంప్రదాయం ఉంది.బాలేన్ షా మాత్రం అందుకు భిన్నంగా తొలుత ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి న్యూయార్క్ వెళ్లారు. అంతకుముందు 2024లో అప్పటి నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ కూడా తన మొదటి విదేశీ పర్యటన కోసం చైనాను ఎంచుకున్నారు. అయితే తొలి ద్వైపాక్షిక పర్యటన కోసం మాత్రం బాలేన్- భారత్‌ను ఎంచుకోవడం సానుకూల సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ ఎగుమతులు భేష్..

- ఈ వృద్ధి కేవలం ఆరంభం మాత్రమే
- మూడేళ్లతో పోలిస్తే 68 శాతం పెరిగాయి
- హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రం నుంచి ఎగుమతులు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో తెలంగాణ ఎగుమతులు అంతకుముందు మూడేళ్లతో పోలిస్తే 68 శాతం పెరిగాయని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తయారీ రంగం, ఎగుమతుల ప్రోత్సాహానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, ఇంజినీరింగ్ ఎగుమతులు వృద్ధి చెందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో వృద్ధి చూస్తుంటే అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చేరుతున్నట్లు స్పష్టమవుతోందని వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, క్రియాశీలక పాలనకు ఇదే నిదర్శనమన్న సీఎం.. ఇది కేవలం ఆరంభమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగమైన క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళిక.. రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలను భారీగా పెంచనుందని ధీమా వ్యక్తం చేశారు.

కాళోజీ కళాక్షేత్రం కళా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకే..

హైదరాబాద్(జనంసాక్షి):

ప్రజా కవి కాళోజీ నారాయణరావు స్మారకార్థం నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలి స్తున్నారనే వార్తల నేపథ్యంలో సీఎం స్పందిం చారు. కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయా లను తరలించవద్దని సీఎం ఆదేశించారు. కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను చర్చించి ఖరారు చేయాలని కలెక్టర్ ను సీఎం ఆదేశించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

హైదరాబాద్(జనంసాక్షి): ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై పలువురు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మహిళా నేతలు సుజాత నాయక్, కంచర్ల కవిత, రజనీరావు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. చంపాపేటలో పింఛన్ల పంపిణీలో అనుచితంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలు, దివ్యాంగులను పింఛన్లు తీసుకోకుండా అడ్డుకున్నారని, ఎమ్మెల్యే.. ఆయన అనుచరులు మహిళలను దుర్భాషలాడి తోసివేశారని ఆరోపించారు.

ఇరుముడిని విమానంలో తీసుకెళ్లొచ్చు

అయ్యప్ప భక్తులకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):అయ్యప్ప భక్తులకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. ఇరుముడిని విమానంలో తీసుకెళ్లేందుకు ఈ ఏడాది కూడా కేంద్రం అనుమతించినట్టు రామ్మోహన్ నాయుడు 'ఎక్స్'లో పోస్టు చేశారు. "అయ్యప్ప భక్తులు ఇరుముడిని తమ వెంట తీసుకెళ్లడం సంప్రదాయం. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, ఇరుముడిని విమాన క్యాబిన్‌లో తీసుకెళ్లేందుకు వరుసగా మూడో ఏడాది కూడా అనుమతులను కొనసాగిస్తున్నాం. ఈ పవిత్ర యాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులందరికీ ఆదేశాలు జారీ చేశాం" అని పేర్కొన్నారు.

23న కొత్త ఇన్‌చార్జ్‌ను కలవండి

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ అధినేత మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువైందని.. రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిస్తోందని తెలిపారు. క్రమ శిక్షణ చర్యలపై ఏఐసీసీ స్పందిస్తుందని చెప్పారు.అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే, ప్రజాపసరాలను విస్మరించి పాలన సాగించే పాలకులను తెలంగాణ ప్రజానీకం, చరిత్ర ఎన్నటికీ క్షమించదని నిన్న రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

తెలంగాణకు ఏరోస్పేస్ రంగంలో మరో భారీ పెట్టుబడి



ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు వేగంగా అనుమతులు కల్పించే ప్రభుత్వ విధానాలు తెలంగాణకు ప్రధాన బలమని వివరించారు. సఫ్రాన్ ప్రతినిధులతో జరిగిన సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగిందని, డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు పారిస్ నుంచి సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే లీప్ విమాన ఇంజిన్లకు అవసరమైన రొటేటింగ్ పార్ట్స్ తయారీ కేంద్రం, సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ తయారీ యూనిట్‌తో పాటు విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రాల్లో ఒకటైన లీప్ ఎంఆర్ఓ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తన తయారీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సంస్థ ఆసక్తి చూపుతోంది.సఫ్రాన్ సంస్థ అంతర్జాతీయ కార్యకలాపాలు, పౌర, సైనిక విమానాల ఇంజిన్ల రూపకల్పన, తయారీ, నిర్వహణ విధానాలను ఉప ముఖ్యమంత్రికి సంస్థ ప్రతినిధులు వివరించారు. అనంతరం తయారీ విభాగాన్ని సందర్శించిన భట్టి విక్రమార్క విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత కచ్చితత్వంతో కూడిన విడిభాగాలను తయారు చేస్తున్న విధానాలను ప్రత్యక్షంగా వీక్షించారు.??ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, సఫ్రాన్ సంస్థ ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డి'ఒరాజియో తదితరులు పాల్గొన్నారు.రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేసేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ సఫ్రాన్ సంస్థ ప్రతినిధులతో తదుపరి సంప్రదింపులు కొనసాగించనుంది. ఈ పెట్టుబడి సాకారమైతే తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ రంగం మరింత విస్తరించడంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి.

వారం క్రితమే ఉద్యోగం.. అంతలోనే అనంతలోకాలకు..

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలంగాణ యువకుడి మృతి

కారులో ప్రయాణిస్తుండగా రోడ్డుకు జింక అడ్డుగా వచ్చింది. జింకను ఢీకొట్టడంతో వాహనం ఆగిపోయింది. దీంతో వెనక నుంచి వచ్చిన వాహనాలు సాయితేజ కారును ఢీకొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తమ కుమారుడు ఉద్యోగం సాధించాడనే సంతోషం మరువకముందే మృతి వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆదివారం రాత్రికి భౌతికకాయం మునుగోడుకు వచ్చే అవకాశం ఉంది.

నేను చెప్పాను.. జనం బంగారం కొనడం మానేశారు. అందుకే ధరలు తగ్గాయి

చేసిన సభలో మాట్లాడుతూ.. బంగారం దిగుమతులు తగ్గితే విదేశీ మారకద్రవ్యం పెరుగుతుందన్నారు. ఇటీవల బంగారం ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో మోదీ వాటిని గుర్తుచేశారు.

ఉక్రెయిన్‌పై ఉరిమిన రష్యా

గంటలకే ట్రంప్ యూరప్ నేతలతో ఫోన్‌లో మాట్లాడినట్టు ఇండిపెండెంట్ కథనం తెలిపింది. రష్యా శాంతి ఒప్పందానికి సిద్ధంగా ఉందని, సాయం ఆపేస్తే బిలియన్ డాలర్ల ఖర్చు ఆదా అవడంతో పాటు వేలాదిమంది ప్రాణాలను కాపాడొచ్చని ట్రంప్ చెప్పినట్టు కథనం పేర్కొన్నది. అయితే ఉక్రెయిన్‌కు సాయం నిలిపివేయాలని ట్రంప్ నేరుగా ఆదేశించలేదని అమెరికా అధికారులు చెప్పారు. యుద్ధాన్ని ముగించాలన్న తన ఆకాంక్షనే ట్రంప్ వ్యక్తం చేశారని వారు వివరించారు. చైనాలో పుతిన్, జిన్‌పింగ్‌తో సమావేశం తర్వాత ట్రంప్ యూరప్ నేతలకు ఫోన్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

యూరప్ దేశాల్లో జెన్ జీ యువత మరోసారి ఆగ్రహంతో భగ్గుమంది. శుక్రవారం 25కి పైగా ఐరోపా దేశాల్లో యువత కదం తొక్కింది. 'మా రాజకీయాలు పక్కన పెట్టి మా సమస్యలు పరిష్కరించండి' అంటూ నినదించింది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ తదితర దేశాల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించి ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. సమస్యలు వేర్వేరుగా ఉన్నా నిరసనల విషయంలో ఏకతాటిపై నిలుస్తామంటూ నిరసన బాట పట్టారు. పెరుగుతున్న జీవన వ్యయం, గృహ అద్దెలు, నిరుద్యోగం, విద్యా రంగానికి నిధుల కొరత, ప్రభుత్వాల యుద్ధ వ్యయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ నినదించారు.

పేద ప్రజలను శక్తిమంతం చేశాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):తాను సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తినని, అలా చేయడాన్ని ఎప్పుడూ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ తొలి ఐఐటీ.. పశ్చిమ బెంగాల్‌లోని 'ఐఐటీ- ఖరగ్‌పుర్' ప్లాటినం జూబ్లీ వేడుకలకు మోదీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల కోసం నిర్బంధ శిబిరం ఉన్న ప్రాంతంలోనే ఐఐటీ ఖరగ్‌పుర్‌ను నిర్మించారు. 75 ఏళ్ల ప్రయాణంలో ఈ ఐఐటీ ఎన్నో మైలురాళ్లను చేరుకుంది. దేశాభివృద్ధిలో, ఆవిష్కరణ రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది" అని ప్రధాని తెలిపారు. "గత 12 ఏళ్లలో ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరిచాం. పేద ప్రజలను శక్తిమంతం చేశాం. పేదరిక నిర్మూలన అంశం గతంలో ఎర్రకోట వేదికగా ప్రసంగాలు, దస్త్రాల రూపకల్పనకే పరిమితమైంది. కానీ, గత 12-13 ఏళ్లలో 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. మా ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైంది. నేను సెమికండక్టర్ మిషన్ గురించి మాట్లాడినప్పుడు.. చాలామంది ఆలస్యమైందన్నారు. కానీ.. ఇప్పుడు ఈ రంగంలో మనం ముందున్నాం. రాబోయే రెండు దశాబ్దాలు విద్యార్థులతోపాటు దేశానికీ ఎంతో కీలకం" అని మోదీ పేర్కొన్నారు.

75 మంది విద్యార్థులతో ముచ్చట..

1951లో స్థాపించిన ఐఐటీ ఖరగ్‌పుర్‌కు ప్రధాని మోదీ రావడం ఇదే తొలిసారి. 75 ఏళ్ల వేడుక సందర్భంగా స్మారక వెండి నాణేన్ని ఆయన ఆవిష్కరించారు.



అంతకుముందు '75 వాయిసెస్ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం కింద 75 మంది విద్యార్థులతో ముచ్చటిం చారు. అనంతరం ఐఐటీ విద్యార్థుల ఆవిష్కరణలు, స్టార్టప్ అంశాలు, పరిశోధనా నమూనాలను పరిశీలించారు. ఇందులో వ్యవసాయం, వస్త్ర పరిశ్రమ, రోబోటిక్స్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డ్రోన్ సాంకేతికత, వైద్య రంగానికి సంబంధించినవి ఉన్నాయి.

ఐఐటీ ఖరగ్‌పుర్‌కు గూగుల్ రూ.46 కోట్లు..

అధునాతన ఏఐ పరిశోధన రంగంలో ఐఐటీ ఖరగ్‌పుర్‌కు 5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.46 కోట్లు) అందించేందుకు టెక్ దిగ్గజం గూగుల్ ముందుకొచ్చింది. "భారతీయ భాషలు, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో ఐఐటీ ఖరగ్‌పుర్ అద్భుతమైన కృషి చేస్తోంది. దీన్ని వేగవంతం చేసేలా సహకరించేందుకు గూగుల్ సిద్ధంగా ఉంది. ఈ విద్యాసంస్థ నా జీవితాన్ని తీర్చిదిద్దినట్లే.. మా సంస్థ సహకారం రాబోయే తరాల విద్యార్థుల భవిష్యత్తును మారుస్తుందని ఆశిస్తున్నాను" అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఏఐ ప్రయోజనాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ చేరాలన్న మోదీ ఆశయాలకు ఇలాంటి కార్యక్రమాలు సాయపడతాయని తెలిపారు.

నీతీశ్ సేతు వంతెనను ప్రారంభించిన ప్రధాని

పాట్నా(జనంసాక్షి):బిహార్‌లో గంగానదిపై నిర్మించిన నీతీశ్ సేతు వంతెనను ప్రధాని నరేంద్రమోదీ శనివారం ప్రారంభించారు. వైశాలీ జిల్లాలోని బిదుపూర్ నుంచి పట్నాలోని కచ్చీ దర్గాను కలిపే ఈ వంతెనకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పేరును పెట్టారు. ఆయన హయాంలోనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. 9.76 కి.మీ. పొడవైన ఈ వంతెనను నిర్మించడానికి సుమారు రూ.4,280 కోట్లు ఖర్చయ్యాయి. ఈ పర్యటనలో ప్రధాని మొత్తం రూ.34,470వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, విద్యుత్తు, పట్టణ మౌలిక సదుపాయాలు, జలవనరులు, విద్య, వైద్యం రవాణా వంటి రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఉన్నాయి. అంతకు ముందు.. ప్రధాని మోదీకి నీతీశ్ కుమార్ పట్నా విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం వైశాలీలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఆ సందర్భంలోనే 100-పీఎంఈ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 26,900మందికి పైగా లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించామన్నారు.

రెండో దశ జనగణనకు వేళాయే..

విద్యార్థులకు ఎలాంటి పరీక్షలు నిర్వహించొద్దని జనగణన విభాగం సూచించింది. జనగణనలో భాగంగా క్యూర్ పరిధి ప్రధానంగా పాత గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రాంతంపై జనాభా లెక్కల విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతంలోని ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరించడానికి అదనంగా ఉద్యోగులను నియమించాలని నిర్ణయించింది. గత మే, జూన్‌లలో జరిగిన తొలి దశ జనగణనలో 80,000 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అప్పుడు క్యూర్ ప్రాంతంలో మొదట అంచనా వేసిన దానికంటే ఎక్కువ కుటుంబాలు ఉన్నట్లు నమోదయ్యాయి. నిబంధనల ప్రకారం ఓ గణన అధికారికి సుమారు 250 కుటుంబాలకు చెందిన 800-900 మంది పౌరుల వివరాలను నమోదు చేసే బాధ్యతలను అప్పగిస్తారు. కానీ కొంత మంది గణన అధికారులు తమ పరిధిలో 1,500 మంది వరకు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రక్రియ కోసం మరో 7 వేల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి పర్యవేక్షకులు అవసరమని అంచనా వేస్తున్నారు. జనాభా లెక్కల సేకరణ రెండో దశ కార్యక్రమంలో భాగంగా పౌరులు తమ వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసుకునే కార్యక్రమం ఈ నెల 16 నుంచి పంజాబ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రారంభమైంది. తెలంగాణలో, పౌరులు తమ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవడానికి జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు గడువు ఇవ్వనున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే, యాప్‌లో ఓ యూనిక్ ఐడీ (గుర్తింపు సంఖ్య) యాప్‌లో వస్తుంది. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 మధ్య గణన అధికారి ఇంటికి వచ్చినప్పుడు, తమ గుర్తింపు సంఖ్యలను అందిస్తే పౌరుల వివరాల నమోదు వెంటనే పూర్తవుతుంది.

ఆ విషయంపై గణన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

దేశంలోని ప్రతిపక్ష పార్టీలు కుల గణన జరపాలని డిమాండ్ చేయడంతో రెండో దశలో సేకరించే వ్యక్తిగత వివరాల నమోదులో కేంద్రం దీనిని చేర్చింది. దీని ప్రకారం ప్రతి వ్యక్తి కులం పేరును అడిగి నమోదు చేస్తారు. ఈ నేపథ్యంలోనే కులం పేర్లు తప్పుగా రాయకుండా లేదా ఒకే కుల పేరును ఎక్కువ మందికి ఉన్నట్లుగా తప్పుడు వివరాలు నమోదు చేయకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకునేలా గణన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఇలా దాడులు చేస్తే పెట్టుబడులు ఎలా వస్తాయి

మెటా క్యాంపస్‌పై కాంగ్రెస్ శ్రేణుల దాడి

వ్యవహారంపై భారస మండిపాటు



హైదరాబాద్(జనంసాక్షి):గచ్చిబౌలిలోని ఫేస్‌బుక్ మెటా ఆఫీస్ మీద దాడి చేసి యూత్ కాంగ్రెస్ నాయకులు బీభత్సం సృష్టించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో నిన్న గచ్చిబౌలిలోని ఫేస్ బుక్ మెటా కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం దారుణమని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వారం ముందే ఇక్కడికొచ్చి సహనం గురించి, రాజ్యాంగం గురించి , ప్రజస్వామ్యం గురించి ప్రపంచంలోని ఎవరెవరినో విదేశాల నుంచి ఇక్కడితీసుకొచ్చి.. అందరితో ప్రవచనాలు చెప్పించి రాహుల్ గాంధీ చేసిందేమిటి.. ? అనిప్రశ్నించారు.ఎవరో ఢిల్లీలోని యూత్‌కాంగ్రెస్ లీడర్ సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేస్తే ఈ కాంగ్రెస్ గుండాలంతా కలిసి కేసీఆర్ హయాంలో గచ్చిబౌలిలో స్థాపించిన ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మెటా క్యాంపస్‌పై దాడి చేస్తారని మండిపడ్డారు. మీరు మహిళా జర్నలిస్టులను జైలులోవేస్తరు.. రాత్రి తీసుకెళ్లి వాళ్లను అరెస్ట్ చేస్తరు.. కకేవలం యూ ట్యూబ్‌లో బీఆర్ ఎస్ పార్టీ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను వేసినందుకు కూడా 2 నెలల పాప ఉంటే కూడా నోటీసులు ఇచ్చి రేఖా అనే జర్నలిస్టును తీసుకెళ్లి

అమృత్ పనులను వేగవంతం చేయాలి

ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి

- రిజర్వాయర్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలి..
- అదనపు కార్మికులను నియమించాలి



మావల, నవంబర్ 22 (జనంసాక్షి): ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు అమృత్ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డికి పలువురు చైర్మన్లు, కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యలు, అమృత్ పథకం పనుల పురోగతిపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనుల వివరాలను సలహాదారుకు వివరించారు. ఇందులో భాగంగా పట్టణంలో సుమారు 80 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తికావస్తున్నాయని, 9 వేల గృహాలకు సర్వీస్ కనెక్షన్లు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అలాగే పట్టణంలో మొత్తం 9 ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇటీవల నాలుగు రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. మిగిలిన ఐదు రిజర్వాయర్ల పనులను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదేవిధంగా పట్టణ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టనున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పనుల పురోగతిపై సమీక్షించిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్టర్లకు నిధుల కొరత లేకుండా బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నామమాత్రంగా కొనసాగించడం కాకుండా, అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి నిర్మాణ వేగాన్ని పెంచాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైప్‌లైన్ పనులు, సర్వీస్ కనెక్షన్లు, రిజర్వాయర్ల నిర్మాణం, ఎస్టీపీ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అమృత్ పథకం పనులు పూర్తయితే ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరాతో పాటు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ కూడా అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ, ఈ పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ప్రభుత్వ సలహాదారు ఆదేశించారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం అండ

మంత్రులు జూపల్లి, వాకిటి

- మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు
- కల్వకోల్‌లో ఘనంగా పండగ సాయన్న విగ్రహావిష్కరణ



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి): అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో పండగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలపై నాయకులు మాట్లాడారు. ముదిరాజ్‌లను ప్రస్తుత బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రులు మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పండగ సాయన్న జీవితం, పోరాట స్ఫూర్తి, ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మత్స్యకారులకు ఉపయోగపడేలా చేపల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లను మంజూరు చేస్తామని ప్రకటించారు. చేపల ఉత్పత్తులను నిల్వ చేసుకోవడంతో పాటు వాటికి మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఈ యూనిట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా నార్లాపూర్ జలాశయం సమీపంలో మత్స్యకారుల అవసరాల కోసం 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పండగ సాయన్నతో పాటు కొమురం భీమ్, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల జీవిత చరిత్రల ఆధారంగా సినిమాలు రూపొందించాలని అభిప్రాయపడ్డారు. కల్వకోల్ గ్రామంలో నిర్వహించిన ఈ విగ్రహావిష్కరణ, బహిరంగ సభ కార్యక్రమం ముదిరాజ్ సామాజిక వర్గంలో ఉత్సాహాన్ని నింపింది. పండగ సాయన్న విగ్రహావిష్కరణతో పాటు మత్స్యకారుల అభివృద్ధికి మంత్రులు ప్రకటించిన హామీలపై నాయకులు, సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, ప్రముఖ కళాకారుడు బిత్తిరి సత్తి, మత్స్యకార సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

దుమ్ము ధూళితో ఉక్కిరిబిక్కిరి

గౌతపూర్ గ్రామస్తుల ఆందోళన

- 50కి పైగా క్రషర్ కంపెనీల టిప్పర్ల నిలిపివేత
- రోజుకు రెండుసార్లు నీళ్లు చల్లాలని డిమాండ్



బాలానగర్, నవంబర్ 21 (జనంసాక్షి): బాలానగర్-గంగాపూర్ రహదారి నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో గౌతపూర్ గ్రామస్తులు దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రోడ్డుపై క్రషర్ కంపెనీల భారీ టిప్పర్లు నిరంతరం తిరుగుతుండటంతో దుమ్ము విపరీతంగా వ్యాపిస్తోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, రహదారి పక్కన నివసించే కుటుంబాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ తాళ్ల ప్రకాష్‌గౌడ్, ఉపసర్పంచ్ పెద్దోని యాదయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు 50కి పైగా క్రషర్ కంపెనీల టిప్పర్లు, ఇతర వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. కల్వర్టుల వద్ద పనులు నిలిచిపోవడం, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు పూటలా నీళ్లు చల్లా

రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు క్రషర్ కంపెనీల యజమానులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నీటి ట్యాంకర్లతో రోడ్డుపై నీళ్లు చల్లి దుమ్ము తగ్గించాలని డిమాండ్ చేశారు. కంకర రోడ్డుపై ద్విచక్ర వాహనాలు జారిపడి పలువురు గాయపడగా, ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని, అప్పటివరకు దుమ్ము సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, ప్రదీప్, నవీన్, నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కందిలో క్లోరో హైడ్రేట్ పట్టివేత

- కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు కారులో అక్రమ రవాణా
- ఒకరి అరెస్ట్, మరొకరిపై కేసు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 21 జనం సాక్షి): కల్తీ కల్లు తయారీకి వినియోగించే క్లోరో హైడ్రేట్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంది గ్రామం సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 2.80 లక్షల విలువైన 56 కిలోల క్లోరో హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేయగా, మరొకరిపై కేసు నమోదు చేశారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు అక్రమ రవాణాపై నిఘా పెంచిన అధికారులు, ముందస్తు సమాచారంతో జాతీయ రహదారులపై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు మారుతి కారులో క్లోరో హైడ్రేట్ తరలిస్తుండగా కంది వద్ద వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. కారులో 28 కిలోల చొప్పున ఉన్న రెండు సంచుల్లో మొత్తం 56 కిలోల క్లోరో హైడ్రేట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.




వడ్లు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

చేర్యాల, నవంబర్ 21 (జనంసాక్షి) : ప్రభుత్వం వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండలం వేచరేణి గ్రామ రైతులు శనివారం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోతో హైవేపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వారు కోరారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి విశ్వవ్యాప్తం!

- నవంబర్ 29న దీక్షా దివస్
- బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల





హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ అమరుల త్యాగాలను, ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ నవంబర్ 29న ప్రపంచవ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహించాలని బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా (21 నవంబర్ 2026) ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని బీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులతో జూమ్ ద్వారా అంతర్జాతీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ గారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చారిత్రాత్మక మలుపుగా నిలిచిందని గుర్తుచేశారు. కేటీఆర్ పిలుపు మేరకు దీక్షా దివస్ సందర్భంగా సభలు, సమావేశాలతో పాటు రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా దీక్షా దివస్ ప్రచారాన్ని విస్తృతం చేయాలని, సోషల్ మీడియా ద్వారా పోస్టర్లు, వీడియో సందేశాలు ప్రచారం చేయాలని, తెలంగాణ ప్రవాసులను భాగస్వాములను చేయాలని కోరారు.

అలాగే వివిధ దేశాల్లో బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాబోతోందని, తెలంగాణ గడ్డపై బీఆర్ఎస్ పార్టీ మరోసారి విజయకేతనం ఎగురవేయబోతోందని మహేశ్ బిగాల ధీమా వ్యక్తం చేశారు. అలాగే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసులకు పార్టీ నాయకత్వాన్ని మరింత చేరువ చేసే లక్ష్యంతో రాబోయే రోజుల్లో కేటీఆర్ దేశాల పర్యటనలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులందరూ ఐక్యంగా పనిచేస్తూ దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

నవంబర్ 26న జిల్లా, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు

- ప్రజాసంఘాల పిలుపు



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యాలయం (జమిస్తాన్ పూర్, ఆర్ టిసి క్రాస్ రోడ్ దగ్గర) లో జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్ ఆవిష్కరణ అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, వృత్తి సంఘాల నాయకులు లెల్లెల బాలకృష్ణ డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, మమత లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని పైగా వ్యవసాయ రంగాన్ని విదేశీ స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారని, రుణమాఫీ,కనీస మద్దతు ధరల చట్టం చేయడం లేదని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు పూను కుంటున్నదని తెలిపారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే రైతులు మాత్రమే కాకుండా యావత్ సమాజం నష్టపోతుందని, దేశ అభివృద్ధిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, రైతులకు ఉపయోగపడే విధంగా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, తొలగించిన 14 కోట్ల మంది ఓటర్ల ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా దాదాపు 93 లక్షల మంది ఓటర్లను ఇదే తరహా పరిస్థితుల్లోకి నెట్టారని, రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గంపై కూడా తీవ్ర దాడి చేస్తోందని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు శ్రీకాంత్,సోమన్న తెలంగాణ రైతు సంఘం నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ పేలి మహిళ కార్మికురాలు మృతి

- ఉప్పల్ హెరిటేజ్ ఫుడ్స్‌లో ఘోర ప్రమాదం..



ఉప్పల్, నవంబర్ 21 (జనంసాక్షి): ఉప్పల్ ఐడీఏలోని హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీలో శనివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యర్థాలను పారవేసేందుకు వెళ్లిన మహిళ కార్మికురాలు డ్రమ్ పేలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో కంపెనీ పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రామంతాపూర్ గాంధీనగర్‌కు చెందిన పింకీ దేవి (35) హెరిటేజ్ ఫుడ్స్‌లో కార్మికురాలిగా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో వ్యర్థాలను పారవేసేందుకు మొదటి అంతస్తులోని డ్రమ్ ప్రాంతానికి వెళ్లగా, ఒక్కసారిగా డ్రమ్ పేలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న కంపెనీ సిబ్బంది మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉండడంతో తల్లి మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, స్థానికులు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. డ్రమ్ పేలడానికి గల కారణాలను గుర్తించి, కంపెనీలో భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రెయిన్ మంజూరు చేయాలి

- సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట వంటా - వార్పు'
- తెలంగాణ యువజన సంఘయి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



సూర్యాపేట (జనంసాక్షి) : సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్, స్టేషన్ ఏర్పాటు చేయాలనీ కోరుతూ తెలంగాణ యువజన సంఘము మరియు తెలంగాణ యువ సమితి ఆధ్వర్యంలో వంటా- వార్పు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో వివిధ పోరాట రూపాల లో 100 రోజుల పైగా సూర్యాపేట జిల్లా కేంద్రం లో ఉద్యమం జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు నిమ్మకి నిరత్త నట్లు ఉన్నారని, సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారి డర్ మరియు స్టేషన్ ఏర్పాటు పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేసారు.

రెండు తెలుగు రాష్టాల రాజధానుల మధ్య వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట కి బుల్లెట్ ట్రైన్ రాకుండా అడ్డుకోవడం అంటే సూర్యాపేట ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడమే అని, కేంద్రం ప్రకటించిన మొదటి అలైన్ మెంట్ ప్రకారం సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ ప్రకటించే వరకు పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర నాయకులు బషీపంగు సునీల్, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనిగా సంతోష్ రెడ్డి, తెలంగాణ యువజన సంఘము సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, తెలంగాణ యువజన సంఘము సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, తెలంగాణ యువజన సంఘము జిల్లా ఉపాధ్యక్షులు ధరవాత్ శివ నాయక్, తెలంగాణ యువజన సంఘము జిల్లా నాయకులు చామకూరి మహేందర్ మహేందర్, భాస్కర్ రెడ్డి, తెలంగాణ యువ సమితి జిల్లా ఉపధ్యక్షులు గడ్డం యాకుబ్ రెడ్డి, నాగు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 నవంబర్ 2026

బంగారం ధరలు తగ్గాయా?

ప్రధాని మాటకు అంత శక్తి ఉందా?

బంగారం ధరలు తగ్గడానికి కారణం తన విజ్ఞప్తేనని, ప్రజలు కొనడం ఆపేయడంతో ధరలు దిగివచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ లఖ్‌నవూ సభలో చెప్పినట్లు ఈ వార్త సారాంశం. వినడానికి ఇది ఆకర్షణీయంగా ఉంది. కానీ ఆర్థిక వాస్తవాలకు నిలబడే వాదన కాదు.

బంగారం ధరను నిర్ణయించేది లండన్, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ మార్కెట్లు. అక్కడ డాలర్ విలువ, అమెరికా వడ్డీ రేట్లు, బాండ్ రాబడులు, ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, ఈటీఎఫ్ పెట్టుబడుల రాకపోకలు, యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు ధరను కదిలిస్తాయి. భారత్ ప్రపంచ బంగారం డిమాండ్‌లో పెద్ద వాటాదారే అయినా, ఎక్కువ భాగం ఆభరణాల వినియోగమే. ధరను శాసించే స్థాయి మన కొనుగోళ్లకు లేదు. అదే నిజమైతే, కొన్నేళ్లుగా మన దేశంలో కొనుగోళ్లు తగ్గినప్పుడు కూడా ధరలు ఆకాశాన్ని ఎందుకు తాకాయి అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలి. ధర పెరిగినప్పుడు "నా విజ్ఞప్తి ఫలించలేదు" అని ఎవరూ అనరు. తగ్గినప్పుడు మాత్రం క్రెడిట్ తీసుకోవడం సులువు.

ఇది ఆర్థిక శాస్త్రంలో "పోస్ట్ హాక్" తప్పిదం. ఒక సంఘటన తర్వాత మరొకటి జరిగినంత మాత్రాన మొదటిదే రెండోదానికి కారణం కాదు. సాధారణ కుటుంబం అంతా కలిసి బంగారం కొనడం ఆపేసి, ఆ డబ్బును ఆదా చేసిందని చెప్పడానికి గణాంకాలు కావాలి. ఇక్కడ చూపింది ఒక అభిప్రాయం మాత్రమే. అంతేకాదు, ధర తగ్గినప్పుడే కొనేవారు, పెళ్లిళ్ల కోసం కొనాల్సినవారు ఎందరో ఉంటారు. వారిని "డబ్బు ఆదా చేశారు" అనడం వారి వాస్తవ పరిస్థితిని పట్టించుకోకపోవడమే.

దేశ నాయకుడు మాట్లాడినప్పుడు ప్రజలు వినడం సహజం. కానీ ఆ మాటను గణాంకాలతో, స్వతంత్ర విశ్లేషణతో పోల్చి చూసుకోవడం పౌరుల బాధ్యత. అధికారంలో ఉన్నవారి వ్యాఖ్యలు రాజకీయ సందేశాలుగా ఉండవచ్చు. పెట్టుబడి నిర్ణయాలు మాత్రం సొంత అవసరాలు, నిపుణుల సలహా ఆధారంగా తీసుకోవాలి. "ప్రధాని చెప్పారు కాబట్టి ధర తగ్గింది" అని నమ్మి, "ఇక మళ్లీ పెరగదు" అని భావించి కొనుగోళ్లు వాయిదా వేయడం ప్రమాదకరం. బంగారం అస్థిరమైన ఆస్తి. ధరలు ఎటైనా కదలవచ్చు.

ప్రధాని విజ్ఞప్తి వెనుక ఒక విధాన హేతువు ఉందన్నది కూడా నిజమే. భారత్ బంగారాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంది. అది కరెంట్ ఖాతా లోటు, విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెంచుతుంది. ప్రజలను ఆ కొనుగోళ్ల నుంచి మళ్లించాలనుకోవడం ఆ దృష్టితో అర్థం చేసుకోదగినదే. కానీ ఆ లక్ష్యానికి మద్దతు ఇవ్వడం వేరు, ప్రపంచ ధరల పతనానికి దాన్నే కారణంగా చూపడం వేరు.

సరైన మార్గం ఏమిటంటే, నాయకులు సాక్ష్యాధారాలతో మాట్లాడాలి, ప్రజలు ప్రశ్నించే అలవాటును వదలకూడదు.

జాతీయవాదం..
మారుతున్న భారత ముఖచిత్రం



జాతీయవాదం అంటే దేశ ప్రజలందరినీ ఐక్యంగా ఉంచే భావన. దేశం ఏ విలువలతో ముందుకు సాగాలి? ప్రజల మధ్య ఎలాంటి సంబంధాలు ఉండాలి? అందరికీ సమాన హక్కులు ఎలా కల్పించాలి? అనే అంశాలను కూడా ఇది నిర్దేశిస్తుంది. భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం నుంచి జాతీయవాదం బలపడింది. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం దానికి పునాదులయ్యాయి. భిన్న మతాలు, భాషలు, కులాలు, సంస్కృతులు కలిగిన ప్రజలను ఒక్కటిగా నిలపడం దాని ప్రధాన ఉద్దేశం. కానీ నేడు ఈ సమ్మిళిత జాతీయవాదం స్థానంలో ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే భాష ఆధిపత్యాన్ని ప్రోత్సహించే ధోరణి పెరుగుతోంది. ఇది భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ఆందోళనకరమైన పరిణామం.

జాతీయవాదంలో ప్రధానంగా రెండు రకాలున్నాయి. ఒకటి పౌర జాతీయవాదం, రెండోది జాతి లేదా మత జాతీయవాదం. పౌర జాతీయవాదం రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. ప్రతి పౌరుడికీ సమాన హక్కులు ఉండాలని కోరుకుంటుంది. వ్యక్తి మతం, కులం, భాష, ఆహారపు అలవాట్లతో దీనికి సంబంధం ఉండదు. అందరినీ సమానంగా చూస్తుంది. కానీ జాతి లేదా మత జాతీయవాదం ఒక మతం లేదా సంస్కృతికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. మిగిలిన సమూహాలను తక్కువగా చూసే ప్రమాదం ఇందులో ఉంది. హిట్లర్ జర్మనీలో ఆర్యజాతి ఆధిపత్య భావన ఎలాంటి ఘోర పరిణామాలకు దారితీసిందో చరిత్ర చెబుతోంది. కాబట్టి జాతీయ ఐక్యత పేరుతో ఇతరుల గుర్తింపులను, రాజ్యాంగం కల్పించిన హక్కులను అణచివేయడం దేశభక్తి అనిపించుకోదు.

భారత రాజ్యాంగం సమానత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ప్రాథమిక హక్కులు, మత స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, వివక్షకు వ్యతిరేకమైన హక్కులు కల్పించింది. ఇవి కేవలం చట్టపరమైన నిబంధనలు కావు. భారత జాతీయవాదానికి నైతిక పునాదులు. అయితే నేడు మతపరమైన మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆహారపు అలవాట్లు, మాంసాహారం, దుస్తులు, వ్యక్తిగత విశ్వాసాలు కూడా రాజకీయ వివాదాలు, నినాదాలు, చట్టాలవుతున్నాయి. మహిళలు తమ శరీర స్వేచ్ఛ, సమాన హక్కుల గురించి మాట్లాడితే సంప్రదాయాల పేరుతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఓటరు జాబితాల సవరణ వంటి ప్రజాస్వామిక ప్రక్రియల్లోనూ పారదర్శకతపై ప్రశ్నలు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ ప్రతి పౌరుడికీ సమానమైన స్థానం ఉందా అనే సందేహాన్ని కలిగిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉండాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విధానాలను విమర్శించడం, అన్యాయానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలపడం భారత రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులు. కానీ అందుకు భిన్నంగా విమర్శకులను దేశద్రోహులుగా చిత్రించడం, ఉద్యమకారులపై కేసులు పెట్టడం, శాంతి యుతంగా నిర్వహించే నిరసనలను కూడా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. శాంతిభద్రతల పేరుతో పౌరుల స్వేచ్ఛను పరిమితం చేయడం కూడా ఆందోళనకరమే. 'శాంతి బాండ్ల'ను అసమ్మతిని అణచివేసే సాధనాలుగా ఉపయోగించడం సరికాదు. రాజకీయ శాస్త్రవేత్త బెనెడిక్ట్ ఆండర్సన్ దేశాన్ని ఒక 'ఊహాత్మక రాజకీయ సమాజం'గా అభివర్ణించారు. అంటే భిన్నమైన ప్రజలు ఒకే దేశానికి చెందినవారమనే భావనతో కలిసివుండటం. అలాంటి సమాజంలో అందరి ఆలోచనలకు స్థానం ఉండాలి. అంతే కానీ ఒక రాజకీయ పార్టీ భావజాలాన్ని మాత్రమే దేశ భక్తిగా ప్రకటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, భారత రాజ్యాంగ చట్టాలకు, విలువలకు విరుద్ధం.

భారత ప్రజాస్వామ్య పరిస్థితిపై అంతర్జాతీయ సంస్థలు కూడా ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఫ్రీడమ్ హౌస్ 2026 నివేదికలో భారత్‌కు 100కు 62 మార్కులు లభించాయి. దేశాన్ని 'పాక్షిక స్వేచ్ఛ' కలిగిన దేశంగా పేర్కొంది. రిపోర్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ 2026 పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ 180 దేశాల్లో 157వ స్థానంలో నిలిచింది. ఈ అంతర్జాతీయ సూచీలే భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ, పౌర హక్కులు, ప్రభుత్వ జవాబుదారీతనం విషయంలో భారత దేశం ఏ పరిస్థితుల్లో ఉందో తెలుపుతున్నాయి.

మరోవైపు రాజకీయ జాతీయవాదానికి కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థతో సంబంధం పెరుగుతోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంపద అసమానతలు, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఇలాంటి సమయంలో మత, జాతి భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే స్థాయిలో ఉంది. ఫలితంగా ఆర్థిక విధానాలపై చర్చ తగ్గి సామాజిక విభేదాలు పెరుగుతున్నాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన 2026 అధ్యయనం ప్రకారం, 2022-23 నాటికి దేశ సంపదలో అత్యంత ధనికమైన ఒక శాతం వాటా 40.1 శాతానికి చేరింది. ఈ భారీ అసమానతలను తగ్గించకుండా కేవలం జాతీయవాద నినాదాలతో సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు.

జాతీయవాదం అంటే ఒక వ్యక్తి అధికార హోదాకు తలవంచడం, అధికార పార్టీ పాలకుల పట్ల విచక్షణ లేని వీరు విధేయతను చూపటం కాదు. దేశ ప్రజల పట్ల బాధ్యత వహించటం. సరిహద్దులను కాపాడటతో పాటు , పౌరులకు భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను గౌరవించడం, సామాజిక న్యాయాన్ని సాధించటం, ఆర్థిక సమానత్వాన్ని కాపాడటం ఇవి అన్నీ కూడా దేశభక్తిలో భాగమే. మతం కంటే మానవత్వానికి, ఆధిపత్యం కంటే సమానత్వానికి, అణచివేత కంటే స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాలి. భిన్నత్వాన్ని బలహీనతగా చూడకుండా, దేశ బలంగా గుర్తించాలి. రాజ్యాంగ విలువలను రాజకీయ ప్రయోజనాల కంటే ఉన్నతంగా నిలబెట్టాలి. అప్పుడే భారత జాతీయవాదం తన అసలైన ప్రజాస్వామిక స్వరూపాన్ని నిలుపుకోగలుగు తుంది. లేకపోతే భౌగోళికంగా ఒక్కటిగా ఉన్న దేశం సామాజికంగా అనేక ముక్కలుగా విడిపోయే ప్రమాదం ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



చుట్టూ గోడలు..

నేనంటే నేనని
నే నే నిజమని
నేనే ముందని
అన్నీ సుళ్లేనని..
చుట్టూ గోడలు
ఎతెత్తు గోడలు
కనిపిస్తూ కొన్నే
అదృశ్యాలెన్నో..
లేపేసుకునినవో
అవే లేసేసినవో
అక్కున చేర్చేవో
కసిరి కాటేసేవో ..
జాతీ రీతీ గేరీ
గడపా లింగం
మొక్కు మోక్షం
తీరొక్క వరణం..
అండగా ఉండేవో
అంతం చేసేసేవో
బారెడు బారెడు
ఇస్రపు పన్నాతో..
కన్నతల్లిని నేననో
చెలియను నేననో
కళ్ళకు గంతగానో
కాళ్లకు మోకయ్యో..
గోడలే గోడలంతా
గోలలే గోలలంతా
ఎన్నాళ్ళీ కుంపట్లు
ఎందాకీ సిగ పట్లు..
భూమి బద్దలవ్వు
భూకంప మొస్తేనే
గోడల గొడవలన్నీ
గొంతు లాపుతయ్..

డా. ఇక్బాల్ పాషా
9440775732

చీకటి వెలుగులు

దీపావళి పండుగ వచ్చిందంటే
ఎందుకో నువ్వే యాద్ కోస్తావ్ నాన్నా!?
మనింటి ప్రహరీ గోడ మీద వెలిగిన దీపాలు
ఇంకా మదిలో వెలుగుతూనే వున్నాయి..
నా ప్రతి రేపటినీ
నువ్వే వెలుగిస్తున్నావని తెలుసు.
చదువు మాత్రమే అందరి
జీవితాలు వెలిగిస్తుందని
నమ్మినోడివి..
మేమంతా వెలుతురులో ఉన్నామంటే
అది నీ రెక్కల చలవే గదా నాన్న!!
జీవితం ఎన్నిసార్లు నిన్ను
పరీక్షించిందో నాకు తెలుసు!!
కచ్చిర్ల యెంబడి ,జామీనులు ఇచ్చుకుంటా,
ఏనాడూ తాతీల్ కూడా ఉపయోగించుకోని
నువ్వు
అన్నిటికీ సహనంతోనే
సమాధానం చెప్పుకున్నావేమో!!
అదే ఓపిక, సర్దుబాటు
ఆభరణలుగా తెచ్చుకున్నానేమో
నీ జ్ఞాపకాలుగా!?
మా కళ్ళల్లో ఉన్న వెలుగంతా
నీవు త్యాగం చేసిన చీకటిరోజుల
చెమట సుక్కలని తెలుసు
నా ప్రతి విజయంలో
మీ ఇద్దరి ఆశీర్వాదాలు
ఉన్నాయని మనస్సుకు
తెలుస్తూనే ఉంది
ఆత్మ గౌరవంతో నిలబడడం
ఎట్లాగో నేర్పించినవ్
నీవు నా అక్షరాల్లో ఉన్నావు
నా ఎదుగుదల లో ఉన్నావు
నీవు గుర్తుకు వస్తే చాలు
నీ కాకి చొక్కా మీద ఉన్న
మూడు సింహాలు మాదిరి
నేను గర్వంగా.. నిలబడతా
అలసటెరుగని నీ పయనంలో
మమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేర్చావు,
మా కళ్ళలో ఆనందపు కాంతుల కోసం
నీ కలలను సైతం త్యాగం చేశావు.
మా రేపటి కోసం
నువ్వు ప్రమిదగా
మారిన క్షణం స్ఫురిస్తే...
నా గుండె చెమ్మగిల్లుతుంది
నీ జ్ఞాపకాల వెలుతురే నాన్న
ప్రతిరోజు దీపావళి నాకు !!
నా బిడ్డ పేరులో అక్షరమై
నిత్యం వెలుగుతూనే ఉంటావు

అనిత కృష్ణ గండమళ్ళ



ప్రతీకారం తీర్చుకునే అధికారం ఉన్నా- క్షమించగలగడం గొప్పతనం!

నెల్సన్ మండేలా నాయకత్వం - జాతి ఔన్నత్యం, మానవత్వం, ప్రజాస్వామ్య సయోధ్యకు ప్రపంచ పాఠం
ప్రతీకారం వ్యక్తిగత ఆగ్రహానికి ప్రతిరూపం; క్షమాపణ నైతిక నాయకత్వానికి నిదర్శనం. అధికారంలోకి వచ్చిన తర్వాత తనను అవమానించినవారిని, హింసించిన వారిని శిక్షించకుండా, ఒక దేశ భవిష్యత్తు కోసం శాంతి, ఐక్యత, సయోధ్యను ఎంచుకున్న నెల్సన్ మండేలా జీవితం ఈ సత్యానికి ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ఉదాహరణ.

చరిత్రలో ఎంతోమంది నాయకులు అధికారాన్ని సాధించడానికి పోరాడారు. మరెంతో మంది అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రత్యర్థులను అణచివేయడానికి, గతంలో తమకు జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకోవడానికి పాలనను ఉపయోగించారు. కానీ అధికారాన్ని ప్రతీకారం కోసం కాకుండా, సమాజంలోని విభేదాలను తొలగించి, శత్రుత్వాలను తగ్గించి, ఒక దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడానికి వినియోగించిన నాయకులు మాత్రం అరుదు. అలాంటి అరుదైన ప్రపంచ నాయకుల్లో నెల్సన్ మండేలా ఒకరు. ఆయన జీవితం కేవలం రాజకీయ పోరాట చరిత్ర కాదు; మానవత్వం, ఆత్మనిగ్రహం, క్షమాగుణం, నైతిక ధైర్యం, నాయకత్వ ఔన్నత్యానికి ఒక విశ్వవిద్యాలయం వంటిది.

దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులపై అమలైన వర్ణవివక్ష విధానం మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించింది. జాతి ఆధారంగా ప్రజలను విభజించడం, వారి స్వేచ్ఛను పరిమితం చేయడం, రాజకీయ హక్కులను నిరాకరించడం, సామాజికంగా అవమానించడం, ఆర్థిక అవకాశాలను అడ్డుకోవడం వంటి అన్యాయాల మధ్య మండేలా తన జీవితాన్ని ప్రజల స్వేచ్ఛ కోసం అంకితం చేశారు. ఆయన ఉద్యమం వ్యక్తిగత ప్రయోజనం కోసం సాగినది కాదు; ఒక జాతి గౌరవం, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన దీర్ఘకాల పోరాటం. ఆ పోరాటంలో ఆయన అరెస్టయ్యారు, జైలు శిక్ష అనుభవించారు, కుటుంబ జీవితానికి దూరమయ్యారు, వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోయారు. సుమారు 27 సంవత్సరాల జైలు జీవితం ఆయనకు శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలను మిగిల్చింది. అయినప్పటికీ ఆయన తన ఆశయాన్ని వదులుకోలేదు. 1990 ఫిబ్రవరి 11న జైలు నుంచి విడుదలైన మండేలా స్వేచ్ఛా దక్షిణాఫ్రికా కోసం తన రాజకీయ పోరాటాన్ని కొత్త దశలో కొనసాగించారు.

జైలు జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలు ఒక సాధారణ మనిషిలో తీవ్రమైన ఆగ్రహాన్ని, ద్వేషాన్ని, ప్రతీకార భావాన్ని కలిగించడం సహజం. తన జీవితంలోని అత్యంత విలువైన సంవత్సరాలను జైలు గోడల మధ్య గడపడం, తన కుటుంబానికి దూరంగా ఉండడం, అవమానాలు, నిర్బంధాలు, కఠిన పరిస్థితులను ఎదుర్కోవడం, తన ఉద్యమ సహచరులు అణచివేతకు గురవడం-ఇవన్నీ మండేలాకు ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన కలిగించే పరిస్థితులే. ఒక వ్యక్తిగా ఆయనకు తనను హింసించినవారిపై ఆగ్రహం కలిగే హక్కు ఉంది. రాజకీయ నాయకుడిగా తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించే హక్కు ఉంది. అధ్యక్షుడిగా అధికారాన్ని ఉపయోగించి గత పాలకులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ ఆయన ఎంచుకున్న మార్గం ప్రతీకారం కాదు; జాతీయ సయోధ్య.

1994లో దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్య ఎన్నికలు జరిగిన అనంతరం నెల్సన్ మండేలా దేశ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అది కేవలం ఒక నాయకుడు అధికారంలోకి వచ్చిన సందర్భం కాదు; దశాబ్దాల వర్ణవివక్ష అనంతరం ఒక దేశం ప్రజాస్వామ్య మార్గంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన చారిత్రక ఘట్టం. ఎన్నో సంవత్సరాలుగా అణచివేతకు గురైన ప్రజలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం లభించింది. అటువంటి సమయంలో గత పాలకులపై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రజల్లో భావోద్వేగాలు వెల్లువెత్తే అవకాశం ఉంది. కానీ మండేలా దేశాన్ని మరో హింసాత్మక ఘర్షణలోకి నెట్టకుండా, ప్రజాస్వామ్యాన్ని స్థిరపరచడానికి, నల్లజాతీయులు-తెల్లజాతీయుల మధ్య నమ్మకాన్ని పెంపొందించడానికి, దేశ భవిష్యత్తును నిర్మించడానికి ప్రయత్నించారు. ఆయన దృష్టిలో అధ్యక్ష పదవి గతాన్ని ప్రతీకారం తీర్చుకునే వేదిక కాదు; భవిష్యత్తును నిర్మించే బాధ్యత.

మండేలా గొప్పతనం ఆయన జైలులో ఎంతటి కష్టాలను ఎదుర్కొన్నారనే దానిలో మాత్రమే లేదు; జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ కష్టాలకు ఎలా స్పందించారనే దానిలో ఉంది. తనను అవమానించిన వ్యక్తుల పట్ల ద్వేషాన్ని పెంచుకోవడం ఆయనకు సాధ్యమే. వారిని రాజకీయంగా అణచివేయడం కూడా ఆయనకు సాధ్యమే. కానీ తన వ్యక్తిగత బాధను దేశ భవిష్యత్తుకు అడ్డంకిగా మారనివ్వలేదు. ఒక నాయకుడు తన గాయాలను సమాజానికి మరిన్ని గాయాలుగా మార్చకుండా ఉండగలిగితే, అదే నిజమైన నాయకత్వం. మండేలా తన జీవితంలో ఆ నాయకత్వ లక్షణాన్ని నిరూపించారు.

మండేలా పాలనలో దక్షిణాఫ్రికా గతంలోని మానవ హక్కుల ఉల్లంఘనలను పూర్తిగా మరచిపోవాలని నిర్ణయించుకోలేదు. అలాగే బాధితుల వేదనను విస్మరించి, నేరాలకు పాల్పడిన వారిని సాధారణంగా క్షమించి వదిలేయడం కూడా ఆయన విధానం కాదు. గతంలో జరిగిన దారుణాలను వెలుగులోకి



తీసుకురావడానికి, బాధితుల అనుభవాలను నమోదు చేయడానికి, నేరాలకు పాల్పడినవారు నిజాలను వెల్లడించే ప్రక్రియకు అవకాశం కల్పించడానికి సత్యం మరియు సయోధ్య కమిషన్ (Truth and Reconciliation Commission - TRC) ఏర్పాటు దక్షిణాఫ్రికా చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. రాజకీయ లక్ష్యాలతో సంబంధం ఉన్న గత నేరాల విషయంలో నిజాయితీగా పూర్తి వివరాలు వెల్లడించే నిర్దిష్ట ప్రక్రియకు అనుగుణంగా అమ్నెస్టీ (క్షమాభిక్ష) పొందే అవకాశం కల్పించడం ద్వారా, ప్రతీకార న్యాయం కంటే సత్యం, బాధ్యత, బాధితుల గుర్తింపు, జాతీయ పునర్నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చే ప్రయత్నం జరిగింది. ఇది ప్రతి నేరానికీ blanket pardon ఇచ్చిన విధానం కాదు; సత్యాన్ని బయటపెట్టడం, గతాన్ని ఎదుర్కోవడం, సమాజంలో కొత్త సంబంధాలను నిర్మించడం అనే లక్ష్యాలతో కూడిన ప్రత్యేక ప్రక్రియ. మండేలా ఈ మార్గం ద్వారా న్యాయం, క్షమాపణ, బాధ్యత, సయోధ్య మధ్య సమతుల్యత సాధించేందుకు ప్రయత్నించారు.

ఇక్కడ మనం ఒక కీలకమైన అంశాన్ని అర్థం చేసుకోవాలి. క్షమించడం అంటే తప్పు చేసినవారిని సమర్థించడం కాదు. అన్యాయాన్ని మర్చిపోవడం కాదు. బాధితుల కన్నీళ్లను తక్కువ చేసి చూడడం కాదు. న్యాయం జరగకూడదని చెప్పడం కూడా కాదు. క్షమాపణ అంటే గతంలోని ద్వేషాన్ని భవిష్యత్తులోకి తీసుకెళ్లకుండా ఉండే నైతిక నిర్ణయం. న్యాయం అనేది బాధితుల హక్కులను కాపాడాలి; క్షమాపణ అనేది సమాజాన్ని నిరంతర ప్రతీకార చక్రం నుంచి కాపాడాలి. మండేలా ఈ రెండింటి మధ్య సమతుల్యత కోసం ప్రయత్నించారు. అదే ఆయన రాజకీయ తత్వంలో ఉన్న గొప్పతనం. అధ్యక్షుడిగా మండేలా చూపిన సయోధ్య భావనకు ప్రపంచం గుర్తుంచుకునే అనేక ప్రతీకాత్మక సందర్భాలు ఉన్నాయి. తన జైలు జీవితంతో సంబంధం ఉన్న మాజీ జైలు అధికారులతో కూడా మానవ సంబంధాలను కొనసాగించడం, తన అధ్యక్ష పదవి ప్రమాణ స్వీకారానికి తన గత జీవితంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఆహ్వానించడం వంటి చర్యలు ఆయన వ్యక్తిత్వంలోని విశాలతను చాటాయి. 1995 రగ్బీ ప్రపంచకప్ సందర్భంగా దక్షిణాఫ్రికా జాతీయ జట్టు 'స్ప్రింగ్‌బోక్స్'కు మద్దతు ఇవ్వడం, గతంలో తెల్లజాతీయుల ఆధిపత్యానికి ప్రతీకగా భావించిన క్రీడా గుర్తింపును కొత్త ప్రజాస్వామ్య దేశం యొక్క ఐక్యతకు ప్రతీకగా మార్చేందుకు ప్రయత్నించడం కూడా మండేలా నాయకత్వంలోని సయోధ్య రాజకీయాలకు గుర్తుగా నిలిచింది. గతంలో విభజనకు చిహ్నాలుగా భావించిన అంశాలను భవిష్యత్తులో ఐక్యతకు చిహ్నాలుగా మార్చగలగడం ఆయన రాజకీయ దూరదృష్టి.

మండేలా క్షమాగుణం బలహీనత కాదు. అది అత్యున్నత ఆత్మబలం. మనల్ని బాధించిన వ్యక్తిని ఎదుర్కొనే సమయంలో కోపంతో స్పందించడం సహజం. కానీ మన కోపం మన నిర్ణయాలను నియంత్రించకుండా ఉండటం కష్టం. ప్రతీకారం తీసుకోవడం ద్వారా మనకు జరిగిన అన్యాయం తీరిపోయిందని అనిపించవచ్చు. అయితే ప్రతీకారం తరచుగా కొత్త అన్యాయాలకు దారి తీస్తుంది. ఒక హింసకు మరో హింస సమాధానమైతే, సమాజంలో శాంతి ఎప్పుడు స్థాపించబడుతుంది? ఒక తరం చేసిన తప్పుకు మరో తరం శిక్ష అనుభవిస్తే, ఆ చక్రాన్ని ఎవరు ఆపుతారు? ఈ ప్రశ్నలకు మండేలా తన ఆచరణ ద్వారా సమాధానం చూపించారు. మనిషి తన గతాన్ని గుర్తుంచుకోవాలి, కానీ గతంలోని బాధలతో తన భవిష్యత్తును బంధించకూడదు.

ఒక దేశం యొక్క జాతి ఔన్నత్యం దాని సైనిక శక్తిలో మాత్రమే ఉండదు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆయుధాలు కలిగిన దేశం కూడా నైతికంగా బలహీనంగా ఉండవచ్చు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశం కూడా సామాజిక ద్వేషంతో విచ్ఛిన్నమవవచ్చు. నిజమైన జాతి ఔన్నత్యం తనకు జరిగిన అన్యాయాన్ని ఎలా ఎదుర్కొంటుంది, బలహీనులను ఎలా ఆదుకుంటుంది, భిన్నాభిప్రాయాలను ఎలా గౌరవిస్తుంది, అధికారాన్ని ఎంత బాధ్యతాయుతంగా వినియోగిస్తుంది, శత్రుత్వాలను ఎంత వివేకంతో పరిష్కరిస్తుంది అనే అంశాల్లో ప్రతిబింబిస్తుంది. మండేలా దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తన వ్యక్తిగత ప్రతీకార భావనను దేశ విధానంగా మార్చకుండా ఉండటం ఈ జాతి ఔన్నత్యానికి ఒక గొప్ప ఉదాహరణ.

ఈ సందర్భంలో ప్రపంచంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అనేక దేశాల్లో రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చిత్రీకరించడం, అధికార మార్పిడి అనంతరం గత పాలకులపై ప్రతీకార చర్యలకు పాల్పడడం, మతం-జాతి-భాష-వర్గాల ఆధారంగా ప్రజలను విభజించడం, యుద్ధాలను తరతరాల ద్వేషానికి సాధనంగా మార్చడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. రాజకీయ నాయకత్వం ప్రజల ఆగ్రహాన్ని శాంతింపజేయాల్సింది పోయి, దానిని తమ ప్రయోజనాల కోసం వినియోగిస్తే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. మండేలా చూపిన మార్గం మాత్రం భిన్నమైనది. అధికారం అనేది ప్రత్యర్థిని నాశనం చేసే సాధనం కాదు; దేశంలోని ప్రతి పౌరుడికి భద్రత, గౌరవం, సమాన హక్కులు కల్పించే బాధ్యత.

మండేలా జీవితం మన వ్యక్తిగత సంబంధాలకు కూడా ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. కుటుంబంలో, స్నేహితుల్లో, ఉద్యోగస్థలాల్లో, సామాజిక సంస్థల్లో విభేదాలు ఏర్పడినప్పుడు మనం వెంటనే ప్రతీకార భావనతో స్పందిస్తాం. మనల్ని అవమానించినవారిని అవమానించడం, మనపై విమర్శించినవారిని మరింత తీవ్రంగా విమర్శించడం, మనకు అన్యాయం చేసినవారికి అదే అన్యాయం తిరిగి చేయాలని భావించడం సాధారణ మానవ స్వభావం. కానీ ఈ విధానం మన సంబంధాలను మరింత దెబ్బతీస్తుంది. ఒక వ్యక్తి తన కోపాన్ని నియంత్రించుకుని, తప్పును స్పష్టంగా ప్రశ్నిస్తూ, అవసరమైన న్యాయం కోరుతూ, వ్యక్తిగత ద్వేషాన్ని మాత్రం విడిచిపెట్టగలిగితే అతను తన జీవితంలో శాంతిని సాధించగలడు. మండేలా వంటి నాయకుల జీవితాలు కేవలం దేశాలకే కాదు, ప్రతి మనిషికి మార్గదర్శకాలు.

క్షమాపణకు పరిమితులు కూడా ఉన్నాయి. ప్రతి సందర్భంలో బాధితుడిపై క్షమించాల్సిన బాధ్యతను మోపకూడదు. తీవ్రమైన హింస, దుర్వినియోగం, అన్యాయం జరిగినప్పుడు బాధితులకు రక్షణ, న్యాయం, సముచిత చర్యలు అత్యంత ముఖ్యమైనవి. క్షమించమని బలవంతం చేయడం మరో అన్యాయం అవుతుంది. మండేలా చూపిన మార్గాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆయన క్షమాగుణాన్ని న్యాయ ప్రక్రియ, సత్యం వెలికితీత, సమాజ పునర్నిర్మాణం, ప్రజాస్వామ్య విలువలతో కలిపి చూడాలి. క్షమాపణ అనేది న్యాయాన్ని అడ్డుకునే సాధనం కాకూడదు; న్యాయం సాధించిన తరువాత సమాజం ద్వేషంతో శాశ్వతంగా బంధించబడకుండా చేసే మార్గం కావాలి.

మండేలా తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న బాధలను రాజకీయ ప్రతీకారానికి ఇంధనంగా మార్చలేదు. తనకు జరిగిన అన్యాయాన్ని దేశం మొత్తం ఎదుర్కొనే మరో అన్యాయంగా మారనివ్వలేదు.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద

పట్లూరు విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం పగటికలే నా..!!

4కోట్లు మంజూరైన ముందుకు సాగని పనులు.. 16 గ్రామాలకు తప్పని కరెంటు కష్టాలు

- కేటాయించిన భూమికి మోకాలు అడ్డు మరోసారి
- భూసేకరణ పేరుతో కాలయాపన
- ప్రభుత్వ మిగులు భూమి ఉన్న విద్యుత్ ఉప కేంద్రానికి కేటాయించని రెవెన్యూ అధికారులు
- సర్వే చేసి భూమిని స్వాధీనం చేసుకోవడానికి తహసిల్దార్ వెనకంజ
- విద్యుత్ ఉపకేంద్రం చుట్టూ తిరుగుతున్న గూడుపుఠాణి
- స్పీకర్ దృష్టికి వెళ్లిన ఫలితం శూన్యం



వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 21 (జనం సాక్షి): చాలుక్యులు పాలించిన గ్రామానికి విద్యుత్ వెతలు తీరలేదు. కొన్ని దశాబ్దాలుగా విద్యుత్ ఉపకేంద్రం కోసం కన్న కలలు నెరవేరలేదు. ఊరికి విద్యుత్ ఉపకేంద్రం వస్తుందని మురిసిన సంతోషం ఎంతోకాలం నిలువలేదు. అప్పుడే ఆవిరైపోయింది. విద్యుత్ కేంద్రం నిర్మాణానికి గ్రహణం పట్టింది. రెవెన్యూ అధికారుల అశ్రద్ధ నిర్లక్ష్యం విద్యుత్ అధికారుల పట్టింపు లేని కారణంగా విద్యుత్ ఉపకేంద్రం కోసం మంజూరైన నిధులు మళ్లీ పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా 16 గ్రామాల్లో నెలకొని ఉన్న విద్యుత్ కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. వివరాల్లోకి వెళితే. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పట్లూర్ విద్యుత్ ఉప కేంద్రానికి గ్రహణం పట్టింది. గత ఆరు నెలల క్రితం తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆర్భాటంగా దాదాపు నాలుగు కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. దీంతో 16 గ్రామాల ప్రజల విద్యుత్ కష్టాలు తొలగిపోతాయని గ్రామస్తులంతా ఎంతో సంతోషించారు. అది కలగానే మిగిలి పోనుంది. చాలుక్యులు పాలించిన పట్లూరు గ్రామానికి ఎన్నో దశాబ్దాలుగా విద్యుత్ సమస్య ఉంది. కొన్ని దశాబ్దాలుగా పట్లూరులో విద్యుత్ ఉపకేంద్రం కావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్లూరు విద్యుత్ ఉపకేంద్రానికి మంజూరు కి అప్పటి నాయకులు హామీ ఇచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో నిధుల మంజూరు జరిగి విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి పునాది పడింది. దీంతో రైతులు వివిధ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ వారి సంతోషం ఎంతో కాలం నిలువలేదు. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి స్పీకర్ పునాది వేసిన ఇప్పటివరకు పనులు ముందుకు సాగలేదు. అందుకు కారణం రక రకాల కారణాలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 248లో విద్యుత్ ఉప కేంద్రం కోసం మర్పల్లి రెవిన్యూ శాఖ విద్యుత్ శాఖకు రోడ్డు పక్కన భూమిని కేటాయించింది. కానీ ఇక్కడనే మరో జిమ్మిక్కు జరిగింది. ఈ పొలం తనదంటూ పట్లూరు గ్రామానికి చెందిన ఒక రైతు శంకుస్థాపనకు ముందే అభ్యంతర వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి రైతుకు తక్కువగా ఉన్న పొలాన్ని కొంచెం మరో చోట చూపిస్తామని రాతపూర్వకంగా రాసి ఇచ్చి శంకుస్థాపన తంతును హడావుడిగా పూర్తి చేశారు. ఆ రైతుకు ఇప్పటివరకు భూమిని కేటాయించకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. అయితే రైతుకు కేటాయించడానికి ప్రభుత్వ మిగులు భూమి ఉంది. అది ఒక భూస్వామి స్వాధీనంలో ఉంది. అ భూస్వామి భూమిని పూర్తిగా సర్వే చేసి పేద రైతుకు భూమినివ్వాలని పట్లూరు గ్రామ సర్పంచ్ పరుశురాం నాయక్ స్థానిక తహసిల్దార్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ భూస్వామి దగ్గర ఉన్న మిగులు భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవడానికి స్థానిక తహసిల్దార్ కు సమయం దొరకడం లేదు. ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఆ భూమి కోసం సర్వే జరగలేదు. ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేపడితే సంబంధిత అధికారులు మిగులు భూములను స్వాధీనం చేసుకొని అభివృద్ధికి మార్గం సుగమనం చేయాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. దానికి కారణం భూస్వామితో తహసిల్దార్ కు ఏమైనా లోపాకారి ఒప్పందం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక గ్రామ పంచాయతీ ప్రథమ పౌరుడే భూమి కోసం ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న పాపానికి తాసిల్దారు వెళ్లలేదు. అంటే దీని వెనక గూడుపుఠాని జరుగుతుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ మిగులు భూమిని స్వాధీనం చేసుకొని విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి మార్గం సుగమనం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ ఉపకేంద్రం పనులు నిలిపివేశారు
ఏఈ రామచంద్రయ్య

పట్లూరు గ్రామ విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి నాలుగు కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని మర్పల్లి ఏఈ రామచంద్రయ్య తెలియజేశారు. ఈ ఉపకేంద్ర నిర్మాణానికి ముందుగా రెవిన్యూ శాఖ విద్యుత్ శాఖకు భూమిని కేటాయించిందని నిధుల మంజూరు అనంతరం అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని మర్పల్లి తహసిల్దార్ ఆదేశించినట్లు తెలియజేశారు. విద్యుత్ శాఖకు కేటాయించిన భూమి కోర్టు పరిధిలో ఉన్నందున నిర్మాణాలు చేపట్టవద్దని మరోచోట భూమిని కేటాయిస్తామని చెప్పిన ఇంతవరకు పని జరగలేదని అన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణం జరిగితే 16 గ్రామాల ప్రజలకు రైతులకు మేలు జరుగుతుందని ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలు తీరిపోతాయని అన్నారు. తమకు ఆ భూమిపై లైన్ క్లియర్ చేస్తే వారం రోజుల్లో నిర్మాణాలు చేపడతామని అన్నారు.

స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లాను
గ్రామ సర్పంచ్ పరుశురాం నాయక్

విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణంలో జాప్యం విషయమై తెలంగాణ శాసనసభ పతి గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పట్లూరు గ్రామ సర్పంచ్ పరశురాం నాయక్ తెలియజేశారు. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి రెవెన్యూ శాఖ స్థలాన్ని కేటాయించిందని ఇప్పుడు అదే స్థలం కోర్టు పరిధిలో ఉందని మర్పల్లి తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి చెప్పుకొస్తున్నారని అన్నారు. విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కేటాయించిన భూమి పక్కనే ఒక భూస్వామి ప్రభుత్వ మిగులు భూమిని స్వాధీనంలో ఉంచుకున్నారని ఆ భూమి సమగ్ర సర్వే చేసి విద్యుత్ ఉపకేంద్రానికి కేటాయించాలని స్థానిక తాసిల్దార్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 గ్రామాలకు సంబంధించిన జటిల సమస్య ఇది అని తమ వంతు సహకారం పూర్తిగా అందిస్తామని భూమిని స్వాధీనం చేసుకోవాలని పదే పదే కోరిన ప్రయోజనం లేదని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఒక భూస్వామి అడ్డువస్తే లైన్ క్లియర్ చేయకుండా అధికారులు దాటవేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఒక సర్పంచ్ ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోతే సామాన్యుడి పరిస్థితి ఏమిటి అని అన్నారు. ఈ విషయమై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలియజేశారు. పట్లూరు విద్యుత్ ఉప కేంద్రానికి మంజూరైన నాలుగు కోట్ల నిధులు మరోచోటికి దారి మళ్లించక ముందే భూమి కేటాయింపు విషయమై అధికారులు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి కేటాయింపు విషయంలో అధికారుల మౌన వెనుక అంతర్యం ఏమిటో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా స్పందిస్తారా దాటవేస్తారా వేచి చూద్దాం.



ఫ్యూచర్ సిటీ పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

70 మంది పోలీసులతో రెండు కాలనీల్లో విస్తృత తనిఖీలు..
47 వాహనాలు,అక్రమ మద్యం స్వాధీనం

శంకర్‌పల్లి, నవంబర్ 21 (జనం సాక్షి) : శాంతిభద్రతల పరిరక్షణ,అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా ఫ్యూచర్ సిటీ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సిపి తరుణ్ జోషి ఆదేశాల మేరకు శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్, గురునానక్ కాలనీల్లో శనివారం తెల్లవారుజామున 5:00 గంటల నుంచి ఉదయం 8:00 గంటల వరకు సుమారు 70 మంది పోలీసులతో విస్తృత తనిఖీలు చేపట్టారు.ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి సీ.ఐ రుద్వీర్ కుమార్ పోలీసు బృందాలతో కలిసి ప్రతి వీధిలో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 47 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.వీటిలో 45 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు ఉన్నాయి. అదేవిధంగా చేవెళ్ల రోడ్డులోని రెండు బెల్ట్ షాపులపై దాడులు చేసి నాలుగు లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ కిషన్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడంతో పాటు నేరాల నియంత్రణకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

డ్రగ్స్ ఉచ్చులో పడితే.. భవిష్యత్తు అంధకారమే!

- నషా ముక్త్ అల్వాల్‌పై అవగాహన ర్యాలీ
- ఓల్డ్ అల్వాల్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ప్రదర్శన
- మత్తు పదార్థాల సమాచారం 1908కు ఇవ్వండి
- సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం: ఏసీపీ రమేష్

అల్వాల్, నవంబర్ 21 (జనంసాక్షి): మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాన్ని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అల్వాల్ డివిజన్ ఏసీపీ జి.రమేష్ యువతకు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు వీర శివాజీ యూత్ అసోసియేషన్, అల్వాల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ‘నషా ముక్త్ అల్వాల్’ ర్యాలీ నిర్వహించారు. ఓల్డ్ అల్వాల్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం తగ్గుతాయని తెలిపారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు లేదా 1908 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్వాల్ డీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాఘవేంద్రరెడ్డి, యూత్ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వద్దు

- అల్వాల్ సర్కిల్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీలు
- అస్తవ్యస్త కేబుళ్ల క్రమబద్ధీకరణకు ఆదేశాలు

అల్వాల్ నవంబర్ 21(జనంసాక్షి): పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం అల్వాల్ సర్కిల్ పరిధిలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి చెత్త నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులు, రోడ్లపై వేలాడుతున్న కేబుళ్లను పరిశీలించారు. డెయిరీ ఫామ్ రోడ్డులోని బస్టాప్ వెనుక పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. రోడ్లపై నిరుపయోగంగా వదిలేసిన, గుర్తింపు లేని వాహనాలను గుర్తించి తరలించాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లోని చెత్త నిల్వ కేంద్రాలను (జీవీపీ) పరిశీలించి, షిఫ్టుల వారీగా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (సీ అండ్ డీ వేస్ట్) ప్రత్యేకంగా సేకరించి తరలించాలని, రోడ్ల పక్కన, లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన రీఫిల్లింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు.



విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా వేలాడుతున్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్ వైర్లను కమిషనర్ పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఐదు అడుగుల కన్నా తక్కువ ఎత్తులో వైర్లు ఉండటాన్ని గుర్తించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వదులుగా ఉన్న, నిరుపయోగ కేబుళ్లను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులు, కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. మిగిలిన వైర్లను క్రమబద్ధీకరించి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ పర్యటనలో ఉప కమిషనర్ భోగేశ్వర్లు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, యూబీడీ, మెయింటెనెన్స్ విభాగాల అధికారులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని కమిషనర్ సూచించారు.

నస్థలిపురంలో 1,000 గజాల స్థలం కేటాయించాలి

- రూ.50 లక్షలతో నూతన చేపల మార్కెట్ నిర్మించాలి : గోరెంకల నర్సింహా

హయత్ నగర్, నవంబర్ 21 (జనం సాక్షి) : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం (టిఎంకెఎంకేఎస్) ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గత 25 ఏళ్లుగా తమ సంఘం మత్స్యకారుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి పలు విజయాలు సాధించిందని, ఆ పోరాటాల ఫలితాలు నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని మత్స్యకారులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉచిత చేప, రొయ్య పిల్లల కొనుగోలు కోసం రూ.116 కోట్ల బడ్జెట్ కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు ఆ నిధులను ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. మత్స్యశాఖలో అవినీతి జరుగుతోందంటూ పత్రికలు, మత్స్యకార సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని నిలదీశారు. అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేప పిల్లల పథకం కింద కేటాయించిన నిధులను ప్రతి మత్స్య సహకార సంఘం బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేయాలని కోరారు. మరణించిన 986 మంది మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, మత్స్య మిత్ర మహిళా గ్రూపులను పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ వనస్థలిపురం రైతుబజార్ వద్ద 1,000 గజాల స్థలం కేటాయించి రూ.50 లక్షల వ్యయంతో నూతన చేపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. నూతన చేపల మార్కెట్‌లో స్థానిక మత్స్యకారులకు వ్యాపార అవకాశాలు కల్పించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, దీంతో మత్స్యకారులు తమ వృత్తిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోతున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, నీరు అందుబాటులో ఉన్న చెరువులు, కుంటల్లో వెంటనే నాణ్యమైన చేప పిల్లలను వదలాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంకెఎంకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి తడబోయిన కృష్ణమూర్తి, సొళ్ల లలిత, మార్కెట్ కమిటీ కోశాధికారి మెంగ సైదులు, ఉపాధ్యక్షులు రసమల్ల యాదగిరి, ఉపాధ్యక్షురాలు చెక్క కుమారి, గంగ, మహేష్, కుద్వదిన్, శ్రీను, రవి, సుబ్బారావు, అర్జున్, ఝాన్సీ పాల్గొన్నారు.



ప్లెక్సీ మాటున అక్రమ నిర్మాణం.. అధికారులకు బెదిరింపులు!

- మాజీ ఎమ్మెల్యే పేరు చెప్పి యజమాని హల్‌చల్
- గతంలో సెల్లార్ మూయించిన నాయకుడే ఇప్పుడు అండగా
- ఆనంద్‌బాగ్‌లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వైనం

మల్కాజిగిరి, నవంబర్ 21 (జనం సాక్షి) :
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆనంద్‌బాగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఓ బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏకంగా మాజీ ఎమ్మెల్యే ప్లెక్సీని భవనానికి అడ్డుపెట్టి, ఆయన పేరుతో అధికారులను బెదిరిస్తూ యజమాని నిర్మాణ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆనంద్‌బాగ్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా,సెల్లార్ తో అదనపు అంతస్తులతో ఓ భవన నిర్మాణం జరుగుతోంది. దీనిపై గతంలోనే టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి యజమానికి నోటీసులు జారీ చేశారు. అయితే, ఆ నోటీసులను బేఖాతరు చేస్తూ యజమాని పనులను ఆపకపోగా, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఫొటోలతో కూడిన భారీ ప్లెక్సీని భవనం ముందు భాగంలో ఏర్పాటు చేశారు. ఈ ప్లెక్సీని అడ్డుపెట్టుకుని, మాజీ ఎమ్మెల్యేకు చెప్తాం అంటూ తనిఖీలకు వచ్చే అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ పైఅంతస్తుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఓ స్థానిక నాయకుడి తీరు విస్మయానికి గురిచేస్తోంది. భవనం ముందు ఏర్పాటు చేసిన ప్లెక్సీలో ఉన్న ఓ స్థానిక నాయకుడే, గతంలో ఇదే అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి, నిబంధనలకు విరుద్ధంగా తవ్విన సెల్లార్‌ను మూసివేయించారు.కానీ, ఇప్పుడు అదే నాయకుడు స్వయంగా రంగంలోకి దిగి, మాజీ ఎమ్మెల్యే ప్లెక్సీని అడ్డుపెట్టి సదరు అక్రమ నిర్మాణానికి అండగా నిలవడం, పనులను ప్రోత్సహించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లను అడ్డుపెట్టుకుని జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, నవంబర్ 21 (జనంసాక్షి): రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపా లిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులు అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమమే లక్ష్యం.. రైతులకు అండగా ప్రభుత్వం!





ఇందిరమ్మ కుటుంబ బీమాతో ఆర్థిక భరోసా

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో ఆడబిడ్డల పెళ్లిళ్లకు చేయూత
- 198 మంది లబ్ధిదారులకు రూ.1.98 కోట్లకుపైగా చెక్కుల పంపిణీ
- ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల ఏర్పాటు..
- సన్న వడ్లకు రూ.500 బోనస్

తాండూరు/పెద్దేముల్, నవంబర్ 21 (జనంసాక్షి): ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా, ప్రతి ఇంటికి సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు చేపట్టారు. తాండూరు మండలం మల్కాపూర్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి కుటుంబం పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఆదుకోవడమే పథకం ఉద్దేశమని వివరించారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూతనిచ్చే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తాండూరు పట్టణం, మండలానికి చెందిన 131 మంది లబ్ధిదారులకు రూ.1,31,15,196 విలువైన చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదికలో మరో 67 మంది లబ్ధిదారులకు రూ.67,07,772 విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు. పేద కుటుంబాలపై వివాహ భారం పడకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

అనంతరం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధరతోపాటు సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో సుధీర్, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ మధులత శ్రీనివాసచారి, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, అధికారులు, సర్పంచులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు రద్దుపై పది రోజుల్లో స్పష్టత ఇవ్వాలి

- లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం.. అవసరమైతే సీఎం ఇంటి ముట్టడికైనా సిద్ధం
- బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

నందిగామ,నవంబర్ 21 (జనం సాక్షి) :
కొత్తూరు మండల పరిధిలో ని సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దుపై ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, మరో పది రోజుల్లో జీవో 641 రద్దుపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని, ఎమ్మెల్యే తమతో కలిసి వస్తే ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి సైతం సిద్

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 నవంబర్ 2026

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి



బెజ్జంకి, నవంబర్ 21 (జనం సాక్షి) : మండలంలోని తోటపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బ్యాంకర్స్ ఇన్స్టిట్యూషన్ సహకారంతో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్,సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్తో కలిసి ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయి అనీ,మహిళల ఆర్థిక అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాంపల్లి శంకర్,వార్డు సభ్యురాలు ఏనుగుల అనిత,ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు సంపత్,నిర్మల,సమత,రాజు,శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలి

- మొదటి విడత ఇండ్ల నిర్మాణం పూర్తి కావాలి
- హౌసింగ్ ఎండి గౌతమ్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 21 (జనం సాక్షి) : గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారుడికి పీఎం ఆవాస్ పథకం కింద సహకారం అందేందుకు జాబ్ కార్డులను తప్పనిసరిగా అందజేయాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ అన్నారు.
శనివారం జిల్లాలో పర్యటించిన తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ప్రతి కుటుంబానికి పక్కా గృహాన్ని నిర్మించి ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు నిర్మించేందుకు లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేయడం జరిగిందన్నారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు



విచారణ జరిపి గ్రామ కమిటీ ద్వారా అర్హులైన వారికి మంజూరు చేయడం జరిగిందన్నారు.

రెండో విడత గైడ్లైన్స్ ప్రకారం ఇండ్ల మంజూరు

ప్రభుత్వం రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రతి నియోజకవర్గానికి 2000 చొప్పున నిర్మించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఇందులో రూఫ్ రీప్లేస్మెంట్ స్కీమ్ లో భాగంగా ఇప్పటికే రేకుల షెడ్లు, పెంకులు, తదితర ఉన్న ఇండ్ల యజమానులు ఆర్ సిసి వేసుకునేందుకు ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున సహకారం అందిస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో వీటిని 500, గుడిసెల్లో ఉంటున్న వారికి 500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గుడిసెలు తొలగించుకుని పక్క గృహాన్ని నిర్మించుకునేందుకు రూ.5 లక్షలను ఇవ్వడం జరుగుతుందన్నారు.

పీఎం ఆవాస్ పోర్టల్లో నమోదు తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ పథకం ద్వారా నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణానికి సహకారం అందిస్తున్నందున వాటి లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకుగాను పోర్టల్ లో ఎఫ్ టీ ఓ (ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్) జనరేట్ చేయాలన్నారు.
ఐహెచ్హెచ్ఎల్ (ఇండిజువల్ హౌస్ హోల్డ్ లెట్రిన్) నిర్మాణానికి కూడా విభి జి రాంజీ పథకంలో రూ.12 చొప్పున సహకారం అందుతుందన్నారు. మొదటి విడతలో కప్పు స్థాయిలో ఇండ్లు నిర్మించుకొని పూర్తి చేసుకోలేకపోయిన లబ్ధిదారులను గుర్తించి వారికి అవగాహన కల్పించడం ద్వారా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించవచ్చన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు,డిఆర్డిఓ ముషాహిదా బేగం, జడ్పీ సీఈవో నాగేంద్రం, డిపిఒ శ్రీకాంత్, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ హరికృష్ణ, పలువురు ఎంపీడీవోలు, ఇతర హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువపై యువతలో అవగాహన పెంపొందించాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణలో యువతదే కీలక పాత్ర
- డీఆర్ఓ రాంరెడ్డి

వనపర్తి, నవంబర్ 21 (జనం సాక్షి) : ప్రజాస్వామ్య దేశంలో ఓటు విలువను గుర్తించడంతో పాటు, ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాంరెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఓటరు నమోదు విధానం, ఈవీఎంల పనితీరు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13న నియోజకవర్గ స్థాయిలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం వనపర్తి ఐడీఓసీ హాలులో జిల్లా స్థాయి



వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఆర్ఓ రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యం, ఓటు హక్కు విలువ, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంతేకాకుండా తమ ఇళ్లలోని కుటుంబ సభ్యులకు, పరిసర ప్రాంత ప్రజలకు సైతం ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వనపర్తి జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా నోడల్ అధికారి పి. సీతారాం, నోడల్ అధికారి సుధీర్ రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఐలయ్య, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక విద్య అందరికీ అవసరం



ఉర్కొండ, నవంబర్ 21 (జనం సాక్షి) : ఊర్కొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య ఐఐటీ జేఈఈ నీట్ అకాడమీ లో గత రెండు రోజులుగా జరిగిన ఐఐటీ సదస్సులో శ్రీ చైతన్య ఇన్ఫినిటీ లర్న్ వారిచే ఐఐటీ లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తూ సర్టిఫికెట్ తో సత్కరించారు. అలాగే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యశిభిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా రోబోటిక్ ఏరోనాటికల్ వంటి ఎగ్జిబిషన్ ప్రదర్శనలో దాదాపు 50పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆలిండియా ఇన్ఫినిటీ లర్న్ సభ్యులు లిఖిత్, కార్తీక్, ట్వింకిల్, పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ వేంకట బాల్ రామయ్య విద్యా సంస్థల కరస్పాండెంట్ సామల బాల్ రాజు మాట్లాడారు. రాబోయే తరం లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యా ఎంతో అవసరం అని తెలిపారు. అందుకే స్థానికంగామన ఉర్కొండ మండల కేంద్రంలో ప్రత్యేక అకాడమీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో శ్రీ వేంకట బాల్ రామయ్య ఐఐటీ జేఈఈ నీట్ అకాడమీ ప్రిన్సిపల్ కృష్ణా రావు , శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్ , వైస్ ప్రిన్సిపల్ రామ్ పెరుమాండ్ల మరియు కళాశాల లెక్చరర్ లు,ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి



జగదేవ్పూర్, నవంబర్ 21 (జనం సాక్షి) : జాతీయ ప్రకృతి మిషన్ కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి సూచించారు.
జగదేవ్పూర్ మండలం, అలిరాజ్పేట గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయో రిసోర్స్ సెంటర్ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఎరువులు, జీవ ద్రావణాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఉత్పాదకాలను తయారు చేసి, క్లస్టర్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. బయో రిసోర్స్ సెంటర్లో నాణ్యమైన జీవ ఎరువులు, జీవ ద్రావణాలను తయారు చేసి, వాటిని రైతులకు విక్రయించడం ద్వారా స్వయం సహాయక సంఘాలు కూడా ఆదాయాన్ని సమకూర్చుకోవడంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కాగా రైతులకు అవసరమైన జీవ ఉత్పాదకాలను సకాలంలో అందుబాటులో ఉంచే విధంగా కేంద్రం కార్యకలాపాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మైథిలి, మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ శరణ్య, ఐకెపి క్లస్టర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సహజ వ్యవసాయ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ లలిత, స్వాతి, స్వయం సహాయక సంఘం సభ్యురాలు లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నివాసం ముందు ధర్నా
- డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మెకు పిలుపు

మక్తల్, నవంబర్ 20 (జనంసాక్షి) : ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, బిఆర్టియు, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మక్తల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి అంబేద్కర్ చౌక్ మీదుగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నివాసం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం మంత్రి పీఏ యాదవ రాజుకు వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.ఆర్. గోవింద్ రాజ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ. 18,000 ఫిక్స్డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2వ పిఆర్సి ప్రకారం రూ. 30 వేల వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు, సగం పెన్షన్,



రూ. 50 లక్షల ఇన్సూరెన్స్, ఏఎన్ఎం/జిఎన్ఎం పూర్తి చేసిన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్ కుమార్, నరహరి, ఆశా వర్కర్లు గోవిందమ్మ, అమీనా బేగం, యశోద, ఇందిర, గౌరమ్మ, శాంతమ్మ, పరిజన బేగం, సుజాత, పార్వతమ్మ, అనిత, స్వప్న, పద్మ, వరలక్ష్మి, రంగమ్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని సృజనాత్మకతను పెంపొందిస్తాయి



ఉర్కొండ, నవంబర్ 21 (జనం సాక్షి) : ఊరుకొండ మండల కేంద్రంలో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మరియు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్, అలాగే మండల స్థాయి బాలల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు. విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊరుకొండపేట మరియు ప్రాథమిక పాఠశాల ఊరుకొండపేటలను సందర్శించారు. పాఠశాలల్లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యాబోధన పట్ల ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధను అభినందించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ ఊరుకొండ పాఠశాలను కూడా సందర్శించిన డీఈవో, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని దివంగత మేకల నరసింహులు స్మారకార్థం వారి కుమారులు మేకల శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందించారు. రాగ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సామ్రాట్ చంద్రశేఖర్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, ప్రధానోపాధ్యాయులు రామస్వామి, ఆనంద్, స్థానిక సర్పంచ్ మంజుల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ రాజు, యూనియన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి వెంకటేశ్వర్ గౌడ్ సురేష్ లక్ష్మి నరసింహారావు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



మిడ్జిల్, నవంబర్ 21 (జనం సాక్షి) : పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మండల పరిధిలో శనివారం మండల పరిధిలోని మరల బాయ్ తండా గ్రామపంచాయతీలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని, నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ సంకల్పమని, అర్హులైన వారందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన దిశ. రిపోర్టర్ బరిగల శ్రీనివాసులు ను ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి. మండల నాయకులతో కలిసి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆరోగ్యంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు అధైర్య పడవద్దు అని ప్రభుత్వంతో మాట్లాడి ఆస్పిటల్ లో అయినా ఖర్చును సీఎం రిలీఫ్ పండు ద్వారా మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌస్. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎడ్ల శంకర్. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు. రాజు. శివప్రసాద్. మార్కెట్ కమిటీ మాజీ వైర్మన్ జ్యోతి అలవాల్ రెడ్డి. మల్లికార్జున్. రెడ్డి. విజయకుమార్ సాయిలు. సర్పంచులు గోదా శ్రీశైలం. నాగరాజు. రాములు, రాజు. ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మరక్షణలో శిక్షణ అవసరం



నర్సాపూర్, నవంబర్ 21 (జనం సాక్షి) : విద్యార్థులు చదువుతోపాటు ఆత్మరక్షణ విద్యల్లోనూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మున్సిపల్ వైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ సూచించారు. నర్సాపూర్ జూనియర్ కళాశాల మైదానంలో సన్షైన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తమ చేతుల మీదుగా బ్లాక్బెల్ట్లను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తూ, వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పట్టుదల, కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బుచేష్ యాదవ్, నిరంజన్, బీజేపీ జిల్లా కోశాధికారి అంజనేయులు గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నాగేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, నాగరాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింగ్రావు, జిల్లా కార్యదర్శి శివ, నాయకులు వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- డిసిసి ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డి

ఖిల్లా ఘనపురం, నవంబర్ 21 (జనం సాక్షి) : మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సమావేశం స్థానిక కార్యదర్శి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి డిసిసి ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాలనే గొప్ప సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించింది అని ఒక కుటుంబంలో సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధతో పాటు, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, నిత్యావసర ఖర్చులు భారంగా మారుతాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ ఇందిరమ్మ కుటుంబ భీమ పథకాన్ని తీసుకువచ్చారు అని ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. బీమా పరిధిలోకి వచ్చిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీలకు రూ.5 లక్షల బీమా మొత్తం అందుతుంది. కుల, మత, ఆదాయ భేదాలు తేడా లేకుండా అర్హత కలిగిన కుటుంబాలకు బీమా రక్షణ ప్రభుత్వం కల్పించడం ఎంతో గొప్ప విషయం. ఈ పథకానికి అర్హులు ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు కుటుంబ పోషణ కోసం పనిచేసే వారు మహిళా ఆయన మగవారు ఆయన ఎవ్వరైనా అర్హులే అని సంపాదించే వ్యక్తికి ఈ బీమా ప్రీమియం వర్తిస్తుంది అలాగే ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. కుటుంబ సభ్యులు తమకు నచ్చిన నామినీలను నమోదు చేసుకోవచ్చు అని ఈ పథకం ఆపద



సమయంలో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రారంభించడం ఎంతో గొప్ప విషయం అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య,సర్పంచ్ నాగన్న,ఉపసర్పంచ్, ఎం.నరేష్,కార్యదర్శి కృతి కృష్ణ, మాసయ్య,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతులను పట్టి అడవికి తరలింపు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి పట్టణ పరిధిలో గత కొంతకాలంగా కోతుల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, చిన్నారులు, వృద్ధులపై దాడి చేయడం, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు కోతులను పట్టి సుదూర అటవీ ప్రాంతాలకు తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య ఆదేశాల మేరకు శనివారం జంగేడు, ఆకుదారి వాడా పరిసర ప్రాంతాల్లో కోతులను పట్టే కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది బోనుల సాయంతో కోతులను సురక్షితంగా పట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి కోతులు పట్టే సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కోతులకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తగా పట్టుకోవాలని ఆదేశించారు. పట్టిన కోతులన్నింటినీ పట్టణం నుంచి సుదూర అటవీ ప్రాంతాల్లో తీసుకెళ్లి విడిచిపెడతామని కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు కోతులకు ఎలాంటి తినుబండారాలు, ఆహార పదార్థాలు వేయకుండా ఉండాలని, దానివల్ల కోతులు పట్టణంలోనే స్థిరపడి బెడద మరింత పెరుగుతుందని సూచించారు. కోతుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా చిన్నారులను ఒంటరిగా వదలవద్దని కోరారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా పట్టణమంతా చేపడతామని, కోతుల బెడద ఉన్న ప్రతి వార్డులోనూ పట్టివేత కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కోతుల బెడదపై ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి సారించాలి.. పక్కదారి పట్టొద్దు

- విద్యతోనే పేదరికం నుంచి బయటపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు
- కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ కళాశాలకు పీఎం ఉషా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య..



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 21 (జనంసాక్షి) : విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సూచించారు. విద్యతోనే పేదరికం నుంచి బయటపడి జీవితంలో వెలుగులు నింపుకోవచ్చని, విద్యపై పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలకు ఆస్తిగా మారుతుందని పేర్కొన్నారు.హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జిజ్ఞాస 2025-26 రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదానోత్సవానికి శాసనసభ్యులు నాయని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని, ప్రతిభ ఎవరి సొత్తు కాదని, పట్టుదలతో కష్టపడితే ప్రతి ఒక్కరూ విజయం సాధించవచ్చని అన్నారు. కళాశాలలో వేలాది మంది విద్యార్థులు నమోదైనప్పటికీ ఇలాంటి కార్యక్రమాలకు మరింత మంది హాజరయ్యేలా ప్రోత్సహించాలని అధ్యాపకులు, కళాశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థులకు కళాశాల వాతావరణంలో లభించే జ్ఞానం, అనుభవం ఎంతో విలువైనవని పేర్కొన్నారు.కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఎమ్మెల్యేతో కలిసి తాను కూడా హాజరవుతానని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ కళాశాలకు పీఎం ఉషా నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రొఫెసర్ చంద్రమౌళి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, జిజ్ఞాస కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో కొనసాగుతున్న కార్తీక శోభ

- నేడు శ్రీ నందీశ్వర స్వామికి ప్రదోషకాల అభిషేకం
- భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- రామప్ప ఆలయ కార్య నిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్



వెంకటాపూర్(రామప్ప), నవంబర్ 21 (జనంసాక్షి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచి, యునెస్కో గుర్తింపు పొందిన శ్రీ రామలింగేశ్వర స్వామి (రామప్ప) దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీక మాసోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం(నేడు) 4:30 గంటలకు ఆలయ ఆవరణలో గల శ్రీ నందీశ్వర స్వామికి ప్రదోషకాల అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్ తెలిపారు.ఈ మేరకు ఆయన శనివారం పాలంపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రదోషకాలంలో నందీశ్వరునికి జరిగే అభిషేకాన్ని దర్శించడం అత్యంత పుణ్యమని ఆయన అన్నారు. శివుని వాహనమైన నందీశ్వరునికి ప్రదోష వేళలో అభిషేకం చేస్తే సకల కోరికలు నెరవేరుతాయని, కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కార్తీక మాసంలో వచ్చే ప్రదోషానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ప్రదోషకాల అభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. అభిషేకం అనంతరం భక్తులకు ఆలయం లో తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.కార్తీక మాసం సందర్భంగా రామప్ప ఆలయం భక్తిభావంతో శోభాయమానంగా మారిందని ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని, కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. నేడు జరిగే ప్రదోషకాల అభిషేకానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలగొద్దు

- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో
- రొయ్యూరు జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన పీఓ
- తేమ శాతం, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, మిల్లులకు తరలింపు ఏర్పాట్లపై సమీక్ష



ఏటూరునాగారం, నవంబర్ 21(జనంసాక్షి) : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు సజావుగా విక్రయించుకునేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రొయ్యూరు గ్రామంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలుకు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం తేమ శాతం తగ్గిన అనంతరం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైనన్ని టార్పాలిన్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం తగ్గిన వెంటనే ప్యాకింగ్ ప్రక్రియ చేపట్టేందుకు తగినన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని, ప్యాక్ చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు సకాలంలో తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పీఓ సూచించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వ, ఆరబెట్టడం, ప్యాకింగ్, రవాణా ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

రైతులతో ముఖాముఖి.. ప్రభుత్వ మద్దతు ధరపై అవగాహన

అనంతరం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో పీఓ మాట్లాడి వారి పంట సాగు వివరాలు, పంటల సరళి, ఎకరాకు వచ్చిన దిగుబడి పరిమాణం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర, అదనపు బోనస్ మొత్తానికి సంబంధించిన వివరాలను రైతులకు వివరించి అవగాహన కల్పించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకునే సమయంలో అవసరమైన సహకారం అందించాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పీఓ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్యాకింగ్ సామగ్రి, రవాణా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు సకాలంలో సేవలు అందేలా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు.

ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

- ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్
- పోలీస్ స్టేషన్ నిర్వహణలో నిరంతర అప్రమత్తత, పారదర్శకత పాటించాలి
- స్టేషన్ పరిసరాలు, రికార్డులు, నిర్వహణపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ఏటూరునాగారం, నవంబర్ 21(జనంసాక్షి) : ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ ఆవరణ, వివిధ విభాగాల నిర్వహణ, రికార్డులు, కేసుల రికార్డ్స్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు.

ప్రజలు తమ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి మర్యాదపూర్వకంగా స్పందించి, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ తనిఖీలో ఏఎస్పీ ఏటూరునాగారం మానన్ భట్ ఐపీఎస్, డిసిఆర్బీడి ఎస్పీ కిషోర్ కుమార్, సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



మహబూబాబాద్, నవంబర్ 21(జనం సాక్షి): శనివారం ప్రపంచ మత్స్యకార దినోత్సవము కలెక్టరేట్ లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహిం చారు. సమావేశానికి మత్స్య శాఖ ఇన్స్పెక్టర్ దామెర. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా మత్స్యకార దినోత్సవ ప్రాముఖ్యతను గూర్చి వివరించడము జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏలినినో ప్రభావంతో చెరువులు అన్ని ఎండి పోయినందున మత్స్యకారుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 10,000 ఆర్థిక సాయం అందజేయాలని వారు కోరారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారునికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి. ప్రభుత్వం మత్స్యకారుల కొరకు ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా నగదు బదులు చేసి మత్స్యకార్లకు ప్రత్యక్షంగా సాయం చేయాలని వారు కోరారు. మత్స్య కారులకు తక్కువ విస్తీర్ణంలో ఉన్నటువంటి వారి యొక్క స్థలంలో చేపల చెరువులకు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్, మాట్లాడుతూ జిల్లాలో 10 ఎకరాల విస్తీర్ణంతో ఉన్నటువంటి స్థలాన్ని మత్స్యశాఖ అప్పగించి అధునాతన ఫిష్ కల్చర్ ని ఏర్పాటు చేయాలని మత్స్యకారుల జీవనోపాధిగా కల్పించే విధంగా నూతన ప్రమాణాలు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు చిల్లా సహదేవ్ ముదిరాజ్, పిట్టల ధనుంజయ,పెద్ది సైదులు, పిడుగు వెంకన్న, నగేష్, బసనబోయిన వెంకన్న, సైదులు మరియు వివిధ మండలాల మత్స్యకారులు పాల్గొన్నారు.

అనవసర సిజేరియన్లు తగ్గించాలి

- సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం
- కలెక్టర్ రాహుల్ శర్మ..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): తల్లి ఆరోగ్య పరిరక్షణకు సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించాలని, అనవసర సిజేరియన్లను నియంత్రించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, సాధారణ ప్రసవాలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నపిల్లలు, కౌమార బాలబాలికలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందించాలని సూచించారు. అన్ని కార్యక్రమాలకు సంబంధించిన తాజా గణాంకాలు, నెలవారీ పురోగతితో కూడిన నివేదికలను వాస్తవ గణాంకాలతో నిర్ణీత సమయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. అంతకుముందు డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, సంపూర్ణ టీకాలు, కుటుంబ నియంత్రణ సేవలు, క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణ, మధుమేహం, రక్తపోటు పరీక్షలు, రక్తహీనత నివారణ, పోషకాహార కార్యక్రమాల పురోగతిని వివరించారు. సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటరత్నం, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, గైనకాలజిస్టులు, వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్ సస్పెన్షన్

తొర్రూరు, నవంబర్ 21 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు పట్టణంలోని 1, 9వ వార్డులలో వార్డు ఆఫీసర్‌గా పనిచేయుచున్న జె.మనేశ్వర్, రెండు పడకల గదుల కేటాయింపులలో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసినందున అట్టి విషయం రుజువైనందున సదరు ఉద్యోగిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుండి తొలగించామని, (సస్పెన్షన్) శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలు, లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.రెండు పడకల గదులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబితే డబ్బులు అడిగితే వెంటనే సమాచారం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులు నిస్వార్థమైన, పారదర్శకమైన, బాధ్యతా యుతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

రెండు లారీలు ఢీ..

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- పోలీసుల చొరవతో ఆస్పత్రికి తరలింపు

కాసిపేట నవంబర్ 21 (జనం సాక్షి) : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం ఫ్లైఓవర్ పై శుక్రవారం రాత్రి బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న రెండు లారీలు ప్రమాదానికి గురయ్యాయి. ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ బలంగా ఢీకొట్టడంతో వెనుక లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రెండు కాళ్లు విరిగాయి . ప్రమాద తీవ్రతకు డ్రైవర్ కాళ్లు లారీ క్యాబిన్ బాడీలో పూర్తిగా ఇరుక్కుపోయాయి. అదే సమయంలో విధుల్లో ఉన్న కాసిపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోపతి శ్రీనివాస్, కానిస్టేబుల్ సాజన్ వెంటనే స్పందించారు. నేషనల్ హైవే సిబ్బంది సహకారంతో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను లారీ నుంచి బయటకు తీసి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సకాలంలో స్పందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించడంతో స్థానికులు అభినందించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో నవంబర్ 21 (జనంసాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టర్ పట్టణంలోని గొల్లపేట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీమా నమోదు తీరును పర్యవేక్షించారు. ఒక కుటుంబానికి బీమా నమోదు చేయడానికి దాదాపు ఎంత సమయం అవుతుందో స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. స్థానిక అధికారులంతా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రజలంతా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కింద నమోదయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న వారికి అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల వివరాలన్నీ స్పష్టంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో సిపిఓ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, స్థానిక కౌన్సిలర్ సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బంజారా కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భరత్ చౌహాన్



నేరడిగొండ నవంబరు 21 (జనంసాక్షి): బంజారా కళాకారులను, కవులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని వారికి పెన్షన్ అందించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భరత్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం రోజున మండలంలోని బుగ్గరాం (బి) గ్రామంలో బంజారా రాష్ట్ర కవి అవార్డు గ్రహీత రాథోడ్ ఉమాజీ మహారాజ్ (ఘనపూర్)కు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భరత్ చౌహాన్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు, బంజారా సంస్కృతి, సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలపై కవులు చేస్తున్న ప్రచారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రవీణ్ జాదవ్, గ్రామ సర్పంచ్ రాథోడ్ కృష్ణ నాయక్, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గుగ్లోత్ అంబారావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంజారా కవులు, అంబారావు నాయక్, ఉత్తమ్ రాథోడ్, ఆడే కిషన్, బద్దు మహారాజ్, చందులాల్ మహారాజ్, పర్సురామ్, మున్నా మహారాజ్. జాదవ్ రూప్ సింగ్. పూజారి దేవరావు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ప్రాన్స్ దేశస్తుడు



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 21(జనంసాక్షి): వెంకటాపూర్ మండలం లోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని శనివారం ప్రాన్స్ దేశానికీ చెందిన సివైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ నైపుణ్యత,కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. తదనంతరం ఆయన రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీనివాస్, దశరథ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 నవంబర్ 2026

2033 నాటికి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దాలి

- తలసరి ఆదాయం రూ.10 లక్షలకు పెంచడమే లక్ష్యం
- శాఖల వారీగా పక్కా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
- కలెక్టర్ దివాకర టి.ఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 21 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లాను 2033-34 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్దిష్ట గడువులోగా వాటిని సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో 2032 మార్చి నాటికి రైతుల నికర ఆదాయాన్ని 15 శాతం పెంచడంతో పాటు 5 వేల ఎకరాల్లో లాభదాయక సాగు పద్ధతులను విస్తరించాలని తెలిపారు. డ్రోన్ల వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, డ్రిప్ ఆటోమేషన్ పెంపు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2030 నాటికి గాలికుంటు, పీపీఆర్, రేబిస్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూచించారు. నాలుగు వేలకు పైగా పశువుల షెడ్ల నిర్మాణం, పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. మత్స్య సంపద పెంపునకు చెరువుల అభివృద్ధి, ఆధునిక మార్కెట్ల నిర్మాణం, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఓవర్‌లోడ్ ఫీడర్ల విభజన, భూగర్భ కేబుల్ పనులు చేపట్టాలని అన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలతో పాటు మోడల్ సోలార్ గ్రామాల ఏర్పాటు, సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ సోలార్ పంపుసెట్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు, కొత్త ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

2028 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5 లక్షలకు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లక్ష్యాల సాధనకు అవసరమైన వనరులు, చేపట్టాల్సిన పనులు, అమలు విధానం, కాలపరిమితిని ప్రణాళికలో స్పష్టంగా పొందుపరచాలన్నారు. గణాంకాల ఆధారంగా అన్ని రంగాల సమతుల్య అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షిస్తూ, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

మధిర రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ నరకం

- ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం



కల్లూరు, నవంబర్ 21 (జనం సాక్షి) : కల్లూరు నుంచి మధిర వెళ్లే ప్రధాన రహదారిపై ప్రజలకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై కూరగాయల వ్యాపారులు రోడ్లపైనే బండ్లు ఏర్పాటు చేసుకోవడం, కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నా సంబంధిత అధికారుల్లో చలనం కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. అత్యవసర పనులపై వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు ప్రజల రాకపోకల కోసమా? లేక వ్యాపారాలు, వాహనాల పార్కింగ్ కోసమా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. నిత్యం ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి స్పందించాలి. రోడ్లపై ఆక్రమణలను తొలగించి, కూరగాయల బండ్లను అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. మరో ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ బీమా నమోదుకు ప్రత్యేక బృందాలు

- 11 పంచాయతీల్లో కౌంటర్లు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి దారావత్ సోమలాల్

కామేపల్లి, నవంబర్ 21 (జనం సాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద మండలంలోని అర్హుల వివరాల నమోదుకు నవంబర్ 19 నుండి డిసెంబర్ 19 వరకు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు కామేపల్లి ఎంపీడీవో ధారావత్ సోమలాల్ తెలిపారు. మొదటి విడతలో 11 గ్రామ పంచాయతీలలోని జీపీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జగన్నాథ తండా, జోగుడెం, కొత్తలింగాల, నెమిలిపురి, పింజరమడుగు, పొన్నెకల్, రామకృష్ణాపురం, రుక్కి తండా పంచాయతీలలో నవంబర్ 20 నుండి 23 వరకు, సాతానిగూడెం, తాళ్లగూడెంలలో నవంబర్ 20 నుండి 25 వరకు నమోదు జరుగుతుందన్నారు. లాల్య తండాకు కూడా బృందాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో రెండో షెడ్యూల్‌లో కేటాయించిన తేదీల ప్రకారం ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీవో స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో డేటా ఆపరేటర్లు, మల్టీపర్పస్ వర్కర్స్ సిబ్బంది వివరాలు నమోదు చేస్తారని,ప్రజలు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాటు సారా విక్రయదారులపై బైండోవర్ కేసులు

- ఏడుగురికి తహసీల్దార్ ఎదుట బైండోవర్..
- మళ్లీ పట్టుబడితే లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష



పినపాక, నవంబర్ 21 (జనం సాక్షి) : పినపాక మండలంలో నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్న ఏడుగురిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ గ్రామపంచాయతీలకు చెందిన ఏడుగురిని గుర్తించి పినపాక తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు, భూపాలపట్నం గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు, దుగినపల్లి గ్రామపంచాయతీకి చెందిన ముగ్గురు నాటు సారా విక్రయదారులను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వీరిని పినపాక తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పినపాక తహసీల్దార్ జి. శ్రీనివాసరావు నాటు సారా విక్రయాలకు పాల్పడవద్దని వారిని మందలించారు. బైండోవర్ అయిన అనంతరం ఏడాది కాలంలో మళ్లీ నాటు సారా విక్రయాలు చేస్తూ పట్టుబడితే రూ.లక్ష జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మండలంలో నాటు సారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన నాటు సారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.

తెల్లం శరత్ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వ భరోసా కల్పించాలి



భద్రాచలం, నవంబర్ 21 (జనంసాక్షి) : గిరిజన యువకుడు తెల్లం శరత్ దారుణ హత్యకు నిరసనగా ఆదివాసీ అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భద్రాచలం బంద్ విజయవంతమైంది. శరత్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు చేపట్టిన ఆందోళనకు పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పాఠశాలలు, కార్యాలయాలు, పెట్రోలు బంకులు, సినిమా హాళ్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. వ్యాపారులు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బంద్‌లో భాగంగా ఆదివాసీ సంఘాల నాయకులు అంబేద్కర్ సెంటర్, ఇందిరాగాంధీ విగ్రహం, స్థానిక మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మానె రామకృష్ణ, గుండు శరత్, కుంజా ధర్మ, కుంజా సంతోష్, పాయం రవివర్మ, సీపీఎం నాయకుడు గడ్డం స్వామిలు మాట్లాడుతూ.. తెల్లం శరత్ హత్య జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఎలాంటి భరోసా కల్పించకపోవడం దారుణమన్నారు. గిరిజన యువకుడి ప్రాణం పోయినా ప్రభుత్వానికి చలనం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేల మౌనంపై నిలదీత

భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఇప్పటివరకు బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని నాయకులు ప్రశ్నించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం శరత్ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన సమయంలో మౌనం వహించడం బాధాకరమన్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని, వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లం శరత్ హత్య ఘటనపై నిష్పక్షపాతంగా, సమగ్ర విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అధికారికంగా నష్టపరిహారం ప్రకటించడంతో పాటు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబ భద్రత, జీవనోపాధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజనుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు.

కారులో రూ.3.83 కోట్ల బంగారం పట్టివేత



శంషాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి) : కారు వెనుక భాగంలో టెయిల్ లైట్ వెనుక ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య అరలో దాచిన 2.98 కిలోల విదేశీ బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు కియా సెల్టోస్ కారులో తరలిస్తున్న 25 బంగారు బిస్కెట్లను నవంబర్ 19, 20 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు రూ.3.83 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. బంగారం తో పాటు, కారును సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై తదుపరి విచారణ చేపడుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశంలో మందిరంలో జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల పై ఎంపిడిఓ, ఎంపీఓ, ఏపిఓ, ఏపిఏం, హౌసింగ్ ఏఈ లతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ రమేష్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, హౌసింగ్ పి డి భగవంత్ రావు, డిపిఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకానికి సంబంధించి జాబ్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పురోగతిని పరిశీలించిన, వెరిఫికేషన్‌లో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సకాలంలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న జాబ్ కార్డుల వెరిఫికేషన్‌ను ప్రాధాన్యతగా తీసుకొని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నీరు పేద ప్రజలకు స్వంత ఇంటి కల నెరవేర్చడం కోసం ఈ పథకం అమలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. మంజూరైన ప్రతి ఇల్లు మార్కింగ్ చెయ్యాలని, రోజు వారిగా ఒక టార్గెట్ పెట్టుకుని పూర్తి చెయ్యాలని, అలాగే జిల్లాలో లబ్ధిదారులు గృహాలు బేస్ మెంట్, గోడలు, స్లాబ్, ప్లాస్టింగ్, ఫినిషింగ్ స్థాయి ఎన్ని, ఎంత మందికి ఏ ఏ స్థాయిలో పే మెంట్ వచ్చింది. ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనీ సమీక్షిస్తూ 100 శాతం గ్రౌండింగ్ చేసి ప్రతి ఒక్క లబ్ధిదారుడు మంచి నాణ్యతతో వేగంగా ఇళ్లు నిర్మించుకునేలా పని చెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ గృహాల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇందిరమ్మ గృహాల నిర్మాణాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందు వరుసలో నిలిచేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల పంటలు పండించడానికి నీరు లేనటువంటి రైతులు, కూలీలకు ఈ జలసిరి లో చేపట్టిన పనుల ద్వారా వారికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నీటి సంరక్షణ పనులను మండలం వారిగా ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలో రైతులను, ప్రజాప్రతినిధులను, అధికారులందరూ సమన్వయ పరిచి ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించారు.

చివరి తడి కోసం సీతారామ జలాలు విడుదల



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 21 (జనం సాక్షి) : పంటలు ఎండిపోకుండా చివరి తడి అందించి ఆదుకోవాలంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, చివరి తడి అందకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాన్ని వివరించి, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో వైరా-ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. విడుదల చేసిన నీరు ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనుంది. తద్వారా ఆయా కాలువల పరిధిలోని పంటలకు చివరి తడి అందే అవకాశం ఏర్పడింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన గోదావరి జలాలను కేవలం పంటల సాగు అవసరాలకే వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా పొలాలకు అందేలా రైతులు సహకరించాలని కోరారు. చివరి తడి అందించడం ద్వారా పంటలను కాపాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయించిన మంత్రి తుమ్మల నిర్ణయంపై ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలును పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మాడుగులపల్లి, నవంబర్ 21 (జనం సాక్షి) : మాడుగులపల్లి మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తీరును మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు శనివారం ఆయన ఆర్డీఓ రమణారెడ్డితో కలిసి మండలంలోని కుక్కడం, గండ్రవానిగూడెం గ్రామపంచాయతీలను సందర్శించారు ఈ సందర్భంగా గ్రామాలలో పథకం నమోదు ప్రక్రియ, నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ బీమా పథకం అందేలా చూడాలని, ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు అనంతరం నల్గొండ నియోజకవర్గ మాడుగుల పల్లి మండల కేంద్రంలో మాడుగుల పల్లి సర్పంచ్ అరురి నరేష్, స్థానిక ఎంపీడీవో వంశీధర్‌తో కలిసి మండల కేంద్రంలో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి వంశీధర్, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్లు ప్రసన్న రాబర్ట్,బొబ్బలి కావ్య శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ కళావతి సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రవణ్, రామ్ రెడ్డి, సురేష్,మాజీ సర్పంచ్ లు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రారెడ్డి, వార్డు సభ్యులు రేఖ వాణి సోమేష్, బొబ్బలి రూప, బొబ్బలి వంశీ, బొబ్బిలి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల్లో 15 రోజుల్లో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

- అధికారులకు ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆదేశం

భద్రాచలం, నవంబర్ 21 (జనంసాక్షి) : జిల్లాలో వీబీ జీ రామ్ జీ పథకం అమలులో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రానున్న 15 రోజుల్లో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. శనివారం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండలాల వారీగా పథకం అమలు తీరును పరిశీలించారు. కొత్త జాబ్ కార్డుల జారీ, ఉపాధి కోరే కూలీల గుర్తింపు, మేట్ల నియామకం, సగటు వేతన రేటు, కూలీలకు పని దినాల కల్పన, కూలీ బడ్జెట్ లక్ష్యాలు, చేపట్టాల్సిన పనుల జాబితా రూపకల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు, రైతులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా జలసిరి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంటలు, ఇంకుడు చెరువులు, మ్యాజిక్ సోక్ పిట్స్, బోరుబావుల నీటి పునర్భరణ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్లు, పశుగ్రాస అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ పథకం కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, డ్రెయినేజీ చివరల్లో ఇంకుడు గుంతలు, సామూహిక పారిశుద్ధ్య సముదాయాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో స్వయం సహాయక సంఘాల భవనాలు, ధాన్య నిల్వ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన మాట్లాడుతూ ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి సంబంధించి అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. నమోదు సమయంలో అవసరమైన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పశుగ్రాస సాగుకు రైతులకు అవకాశం

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఏర్పడే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపద పరిరక్షణకు పథకం కింద పశు



గ్రాస అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు విద్యాచందన వివరించారు. రైతుల వ్యక్తిగత భూములతో పాటు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లోనూ పశుగ్రాసం సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమి కలిగి, బోరు, కాలువ, చెరువు లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. పశుగ్రాస సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు ఈ పథకం గురించి అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీర్లు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22.11.2026

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

నిర్భయంగా ప్రశాంతంగా
పరీక్షలు రాయండి : సిపి సాయి చైతన్య



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,జనంసాక్షి:
ఎస్ఐ రాత పరీక్షలు ఈనెల 29 ఉన్నాయని విద్యార్థులు ప్రశాంతంగా నిర్భయంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలుపుతున్నట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జామ్నేషన్ సెంటర్ పరిసర ప్రాంతాలలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు.ఈ పరీక్ష ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలి పారు.ఇట్టి ఎగ్జమినేషన్ సెంటర్ లో పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేం ద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుం పులుగా చేరడం నిషేధం. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని పరీక్ష కేంద్రాలలో 29న సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ షాపు లు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేయబడుతుందని , పరీక్ష కేంద్రముల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరీక్షలు రాసే విద్యార్థులందరూ ప్రశాంతంగా , ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయవంతంగా ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాసుదేవరెడ్డి



హుజూరాబాద్(జనంసాక్షి):
హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెం డెంట్‌గా డాక్టర్ వాసుదేవరెడ్డి నియమితులయ్యారు .ఈ మేరకు డీసీహెచ్ కృష్ణప్రసాద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన ఏరియా ఆసుపత్రిలో నూతన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వాసుదేవరెడ్డికి అభినందనలు తెలియజేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై కొరడా



ఎల్లారెడ్డిపేట (జనంసాక్షి):
ఎల్లారెడ్డిపేటలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్‌గౌడ్, మండల అగ్రీకల్చర్ అధికారి రాజాశేఖర్ కలిసి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుఖాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని సూచించారు. బిల్లు ఇవ్వకపోయినా, నకిలీ ఇత్తనాలు విక్రయించినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు ఆలయాల్లో చోరీ..


దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట (జనంసాక్షి) : మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీవేణుగోపాల్ స్వామి దేవాలయం హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ. 3, 000 నగదును గర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదేవిధంగా గొల్లపల్లి గ్రామంలోని శివాలయం, కొత ్తకుంట హనుమాన్ దేవాలయాల్లో కూడా దొంగతనాలు జరిగినట్లు గొల్లపల్లి గ్రామానికి చెందిన నిమ్మతుల రామ్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ ఎన్. రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆధారాలు సేకరించి గొల్లపల్లి గ్రామానికి చెందిన ముద్రకోల నర్సింహులు అనే వ్యక్తి సదరు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ దేవాలయాల నిర్వాహకులు ఆలయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, హుండీలకు పట్టిష్టమైన భద్రత కల్పిం చాలని, ఆలయాల్లో విలువైన వస్తువులు, నగదు విష యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో ఆలయాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అం దిం చాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

పేద కుటుంబాలకు కొండంత భరోసా..

ఇందిరమ్మ జీవిత బీమా

దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న పథకం




భిక్కనూరు నవంబర్ 21 (జనంసాక్షి):
భిక్కనూరు మండల కేంద్రంలో శనివారం ఎస్.వి గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రాథమిక సహకార సంఘం నూ తన చైర్మన్ లింగాల రాజబాబు గౌడ్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు. నూతన చైర్మన్ రాజబాబు గౌడ్ మాట్లాడుతూ వయ సులో చిన్న వాడిని అయినా నాకు సహకార సంఘం అధ్యక్షుడుగా ఆకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ సల హాదారులు, పితృ సమానులు అయినా మహమ్మద్ షబ్బీర్ అలికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు అందుబా టులో ఉంటూ వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సకాలంలో అందే విధంగా కృషి చేస్తానని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా పథకం భారతదేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పేదల సంక్షేమ పథకం తెలంగాణ రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆపద సమ యంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అని అన్నారు. ఈపథకం ద్వారా ఆకు టుంబ యజమాని, కుటుంబ పెద్ద ఏదైనా కారణంతో మరణం సంభవిస్తే, లేదా పూర్తి వైకల్యం కలిగిన మా కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ 5 లక్షల జీవిత బీమా సొమ్ము వారి కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం లోని యజమాని 18 సం,నుండి 58 సం, గలవారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గత పది సంవత్సరాల బి. ఆర్.ఎస్, కెసిఆర్ ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇండ్లు,నూతన రేషన్ కార్డులు మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని విడుదల వారీగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో మహిళా సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తూ, ప్రతి సంఘానికి వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని ప్రతి మహిళ డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉండాలని సూచిం చారు,అనంతరం భిక్క నూరు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన చే యూత నూతన పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రా లను అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథ కంలో నమోదు చేసుకున్న కుటుంబా నికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈకార్యక్ర ంమంలో జిల్లా సొసైటీ అధికారి రామ్మోహన్,భిక్కనూరు సొసైటీ సీఈ వో రాజు,రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఇలియా స్, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగన్న గారి నరేందర్ రెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్ద బచ్చగారి రామ్ రెడ్డి ,భిక్కనూరు గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దయాకర్ రెడ్డి,తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ తిరుపరి భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, మాజీ సర్పంచ్ నరసింహ రెడ్డి, ఎంపీడీవో సవితా రెడ్డి, ఎమ్మార్వో సునీత, రెవిన్ ఇన్స్పెక్టర్ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ నెంబర్ బాస వేణు గోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి నవంబర్ 21(జనంసాక్షి)
అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకా లు అందజేస్తుందని తెలంగాణ రాష్ట్రం పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ నెంబర్ బాస వేణు గోపాల్ యాదవ్ అన్నారు.మండలం లోని ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రోజున గ్రామ సర్పంచ్ ఎనుగందుల శైలేందర్ అధ్యక్షతన నిర్వహించిన నూతనంగా మంజూరైన ఇందిరమ్మ చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరైన పత్రాల అందజేత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ బాస వేణుగోపాల్ యాదవ్,గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా,ప్రజా పాలనకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.పేదలు,దివ్యాంగులు, వితంతువు లు,ఒంటరి మహిళలు,గీత కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ చేయూత పింఛన్ల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ బాల్కొండ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారికీ కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు దాసరి రాకేష్,డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏలేటి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వకేట్ సుం కరి విజయ్,నడుకుడా క్రాంతి,బండి ఆంజనేయులు, మంచిర్యాల దినేష్,నిరటి ఉమేష్, గ్రామ ప్రజాప్రతి నిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.



కాంగ్రెస్ అసత్య ప్రచారాలతో దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది


బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ విమర్శలు



గన్నేరువరం(జనంసాక్షి):దేశ ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో పెంచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం అసత్య ప్రచారాలతో దేశ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ విమర్శించారు. శనివారం బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నీకేష్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు దిమాక్ నక్సల్స్ తరహాలో ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టేం దుకు ఈ నెల 23న కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మండల కోఆర్డినేటర్ సుగుత్తి జగదీశ్వరచారి, కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, మండల ఉపాధ్యక్షులు గాలిపెల్లి శంకర్,కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కర్ర అనూష రెడ్డి, శక్తి కేంద్ర ప్రభారీలు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలి

ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు.



సుల్తానాబాద్(జనంసాక్షి) : రైతులు,ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. శనివారం మండలంలోని, సుగ్లాంపల్లి, గ్రామంలో ఐకెపి,ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ స్థానిక సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించి మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన పంటను అధిక ధర వస్తే ఇతరులకు సైతం విక్రయించు కోవచ్చునని ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని రైతుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, రైతు సెల్ మండల అధ్యక్షులు మన్నాల రామన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్ రావు, సీఈవో బూరుగు సంతోష్, డైరెక్టర్లు,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళా సంఘాలు,గ్రామస్తులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.



బస్‌డీపో మాకొద్దు

నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చౌక్‌లో రైతుల ధర్నా

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్డులో ఉన్న బడా రామ్ మర్ కు చెందిన సాగులో ఉన్న వ్యవసా య భూములో టీ జి ఎస్ ఆర్ టి సి బస్ డిపో నిర్మాణానికి ఆర్టీసీ ,రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు వేయడాన్ని నిరసిస్తూ, బడా రామ్ మర్ కౌలు రైతుల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చౌక్ వద్ద రైతులు ధర్నా నిర్వహిం చారు.ఈ సందర్భంగా కౌలు రైతుల కన్వీనర్ ఆకుల పాపయ్య, కో-కన్వీనర్ ముత్యాల నర్సారెడ్డి, లింగం తదితరులు మాట్లాడుతూ “గత 140 సంవత్స రాలకు పైగా మఠానికి ఎకరానికి 5 వేల రూపాయలు కౌలు చెల్లిస్తూ మేము ఈ భూములను సాగు చేసుకుంటున్నాము. ఎస్సీ, బీసీ, ఇతర కులాలకు చెందిన భూమిలేని రైతులం ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తు న్నాము” అని అన్నారు. బడా రామ్ మర్ వ్యవసాయ భూముల్లో దేవాదాయ శాఖ పెత్తందారీ దౌర్జన్యం నశించాలి.రెవెన్యూ శాఖ ఏకపక్ష నిర్ణయాలు సరికాదు.బడా రామ్ మర్ వ్యవసాయ భూముల్లో ఎఊఖీఅ అక్రమ కబ్జా నశించాలి.నాగారం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఎఊఖీఅ కి కేటాయించాలి.న్యాల్కల్ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ ఏర్పడుతున్నందున మరో బస్ డిపోను నాగారం ప్రాంతానికి మార్చాలి.పంట పండించే వ్యవసాయ భూములను గుంజుకోవద్దు.”బడా రామ్ మర్ భూములపై రామ్ మఠానికే అధికారం ఉంది. దేవాదాయ శాఖ పెత్తనం వద్దు” అని రైతులు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ముత్యాల నర్సారెడ్డి, అంబదాస్, ఆకుల శ్రీనివాస్, రవి, శ్రీను లావణ్య, లక్ష్మి, గంగమణి,రావు, లింగం, శివ, కిరణ్, మనోహర్ తదిత రులు పాల్గొని ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ప్రగతిశీల వెజిటేబుల్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.శివకుమార్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,జనంసాక్షి:తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గత అనేక సంవత్సరాల నుండి మోటార్ కార్మికులు డిమాండ్ చేస్తున్నప్పటికీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గతంలో ఆటో క్యాబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఆరోజు సమ్మెకు వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల జేఏసిని పిలిపించి వారితో రవాణా రంగ శాఖ మంత్రి మాట్లాడి మీరు సమ్మెకు వెళ్లొద్దని చెప్పారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అలాగే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి లెటర్ రాసి ఇవ్వడంతో ఆరోజు సమ్మె విరమించడం జరిగింది. కానీ ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి. ఎం. శివకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎం . శివకుమార్. మాట్లాడుతూ మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే వరకు తెలంగాణలోని మోటార్ కార్మికులు సంఘటితమై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడదని అన్నారు. ఈ సమావేశంలో ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు భూమన్న. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు. ఇమ్రాన్. అమిత్. షబ్బీర్. బాబా .శివ. జాబర్.సోను.జలీల్. తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్

గాంధారి(జనంసాక్షి):ఒక కెమెరా 100 మందితో సమానమని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ అన్నారు. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని తిప్పారం తండాలో దాదాపు రెండు లక్షల 50 వేల రూపాయలతో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ను గ్రామ ప్రజలకు అన్ని డి.ఎస్.పి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పద్ధతులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ గంగారం నాయక్ ఉపసర్పంచ్ గ్రామస్తులు దాతల సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేరాలు నియంత్రణ నేరాల పరిశోధన ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అంతేకా కుండా మాదకద్రవ్యాల నివారణ సైబర్ నెలల పట్ల అప్రమత్తంగా ఉండాలని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ వీరయ్య, ఎస్సై మహేందర్, తిప్పడం తండా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తాడికల్ విద్యార్థిని

శంకరపట్నం జనంసాక్షి:



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతి భ కనబరిచిన తాడికల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పప్పు రూపాలి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 20వ తేదీన 14 ఏళ్ల లోపు బాలబాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలోని సుల్తానాబాద్ జీజేసీ కళాశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రూపాలి తన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు పొందుతూ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన రూపాలిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, యువకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- ఆ బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదే
- ఓటు హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : సిరాజ్ హుస్సేన్



కరీంనగర్ బ్యూరో/ భూపాలపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):
:ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అర్హులైన ప్రతి ఓటరు ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ బాధ్యతను సామాజిక కర్తవ్యంగా స్వీకరించి ప్రజలకు అండగా నిలవాలని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ సిరాజ్ హుస్సేన్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లిలో నిర్వహించిన ఓట్ బచావో దేశ్ బచావో ఎస్ఐఆర్ ఫేజ్ -3 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఓటు రక్షక్ సేవకుల అప్లికేషన్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అప్లికేషన్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా నమోదు చేసుకోవాలి, సామాన్య ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి దానిని ఎలా వినియోగించుకోవాలి, బూత్ స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా సేవలందించాలనే అంశాలపై సిరాజ్ హుస్సేన్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి సుమారు 90 లక్షలకు పైగా ఓట్లు తొలగించబడినట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 35 వేలకుపైగా ఓటర్ల వివరాలు అనామలీస్ డేటా కింద గుర్తించబడ్డాయని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.భూపాలపల్లి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని డివిజన్లు, మండలాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని, మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు , ఓటు రక్షక్ సేవకులతో సమన్వయ స

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 నవంబర్ 2026

విద్యార్థుల హాజరు శాతం పెరగాలి

- టీచర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలి
- విద్యాలయాలకు వచ్చేలా ప్రోత్సహించాలి
- పేరెంట్ టీచర్ మీటింగ్‌లు క్రమం తప్పకుండా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 21(జనంసాక్షి);
జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్, ఆన్లైన్ తరగతులు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, విద్యా శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా టీచర్లు, విద్యాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అన్ని విద్యాలయాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యాలా ప్రోత్సహించాలని సూచించారు.బడికి హాజరు కాకపోవడానికి కారణాలు తెలుసుకోవాలని,నిత్యం వచ్చేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బంది ఉంటే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలి
యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ పనులు పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు.పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను మొదలుపెట్టాలని తెలిపారు.నాబార్డ్ నిధులతో విద్యాలయాల్లో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.పీఎం ఉష కింద గంభీరావుపేట, అగ్రహారంలో నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.

పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను అన్ని విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారి, వారవారం పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆన్లైన్ తరగతులను వినియోగించు కోవాలని పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

క్రమం తప్పకుండా నిర్వహించాలి
పేరెంట్ టీచర్ మీటింగ్‌లు అన్ని విద్యాలయాల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని మీటింగ్లకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలి
విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితం ఇతర పాఠ్యాంశాలు రాసి,చదివేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులను రానున్న వార్షిక పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ప్రశ్నాపత్రాలు సాధన చేయించాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలు చదివి రాసేలా సాధన చేయించాలని స్పష్టం చేశారు.అన్ని విద్యాలయాల బాధ్యులు పకడ్బందీ ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి అన్ని అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహించాలని, పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యా అధికారులు తమ పరిధిలోని అన్ని విద్యాలయాల్లో తరచూ తనిఖీలు చేయాలని సూచించారు.ఇట్టి సమావేశంలో జిల్లా విద్యాధికారి విజయ సాగర్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- చెడు స్నేహాలు, తాత్కాలిక ఆకర్షణలకు లోనుకావద్దు
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి
- పీయం శ్రీ ఆదర్శ పాఠశాలలో అవగాహన కార్యక్రమం



సిరికొండ, నవంబర్ 21 (జనంసాక్షి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని డాక్టర్ అరవింద్ సూచించారు. సిరికొండలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు కుటుంబ వ్యవస్థ, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితానికి పునాది అని, చెడు స్నేహాలు, తాత్కాలిక ఆకర్షణలు, ఇతరుల ప్రలోభాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. చదువుతోపాటు క్రీడలు, యోగా, వ్యాయామం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, సరఫరా గురించి సమాచారం తెలిస్తే ఉపాధ్యాయులు, పెద్దలు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం విద్యాసంస్థల బాధ్యతని అన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తులకే కాకుండా కుటుంబాల విచ్ఛిన్నానికి, సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, ఏఎన్ఎం స్వరూప, ఆశా కార్యకర్త శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధిగా మంత్రి పొన్నం ప్రభాకర్

- దివ్యాంగులు,వయోవృద్ధుల జీవితాల్లో కొత్త వెలుగులు
- మంత్రి పొన్నం ప్రత్యేక చొరవతో చిగురుమామిడిలో అలింకో ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల నమోదు కార్యక్రమం
- తమకు అండగా నిలిచిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు



చిగురుమామిడి నవంబర్ 21(జనంసాక్షి): నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో చిగురుమామిడి మండలంలో మానవతా దృక్పథంతో కూడిన బృహత్తర కార్యక్రమాన్ని శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు.మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో అలింకో సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక నమోదు (రిజిస్ట్రేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు.సామాజిక బాధ్యతతో మంత్రి పొన్నం ప్రభాకర్ తీసుకున్న ఈ నిర్ణయంతో, చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల నుంచి దివ్యాంగులు, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దాదాపు 15వందల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అర్హులైన వారికి అవసరమైన చేతికర్రలు, వినికిడి పరికరాలు, మూడు చక్రాల వాహనాలు (ట్రై సైకిళ్లు), కళ్లద్దాలు తదితర సహాయ ఉపకరణాలను అందించేందుకు అధికారులు క్షుణ్ణంగా నమోదు ప్రక్రియను చేపట్టారు.తమ కష్టాలను,అవసరాలను స్వయంగా గుర్తించి, సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేకంగా ఈ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించడం పట్ల దివ్యాంగులు, వయోవృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.అభాగ్యులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తమకు అవసరమైన పరికరాలు అందించి ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేస్తున్న మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆనందంతో పేర్కొన్నారు. కరీంనగర్ ఆర్డీవో షర్మిల,డిడబ్ల్యుఓ సరస్వతి, సీడీపీఓ శ్రీలత,సూపర్‌వైజర్ సుల్తానియా,సఖి,చైల్డ్‌లైన్, ఐసిడిఎస్ అధికారులు తమ ఉద్యోగులతో దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా చూసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందె సురేష్,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,డీసీసీ కార్యదర్శులు బడుకొలు దేవేందర్ రెడ్డి,సొంబారి బాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్‌కుమార్ గౌడ్, సర్పంచులు కాటం సంపత్ రెడ్డి, అల్లెపు సంపత్,కొంకట మౌనిక,గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి,గోగురి లక్ష్మీ మురాహరి రెడ్డి,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయిని వేణు, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు పశ్చిమట్ల అజయ్ గౌడ్,మండల సోషల్ మీడియా అధ్యక్షులు జిల్లెల్ల రమేష్,మండల మహిళా అధ్యక్షురాలు పోలు స్వప్న, డైరెక్టర్ పోటు మల్లారెడ్డి, నాయకులు అందే పరశురాములు,గుడిసె మల్లికార్జున్, కనగండ్ల సునీల్, కూరెళ్ళ కిషోర్,గంధె రమేష్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల సీనియర్ నాయకులు,గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,పాక్స్ డైరెక్టర్లు, పార్టీ కార్యకర్తలు,అభిమానులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నిజామాబాదులో సామూహిక వివాహాలు

- మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పుట్టినరోజు కానుకగా పాల్గొన్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 21 జనం సాక్షి :
మాజీ పీసీసీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ 20 సంవత్సరాల క్రితం ప్రారంభించిన సామూహిక వివాహాల వేడుకలను ఆయన తనయుడు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు కానుకగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నట్లు టిపిసిసి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన సామూహిక వివాహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో మనిషి స్థిరంగా నిలకడగా ఉండాలంటే రెండు ఆచరించక తప్పదని ఒకటి సొంత ఇల్లు రెండు భార్య, అందులో ఇరువైపులా తానే పెద్దగా నిలబడి సామూహిక వివాహాలు జరిపించడం అది కూడా 20 సంవత్సరాలుగా ప్రతి పుట్టినరోజు కు సామూహిక వివాహాలు జరిపించడం మామూలు విషయం కాదని తండ్రి స్థానంలో ఉండి వివాహాలు జరిపిస్తున్న ధర్మపురి సంజయ్‌కి హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. కులము మతము తేడా లేకుండా నూతన జంటలకు వివాహాలు జరిపించడం శుభసూచకమని ఎనిమిది జంటలకు వివాహాలు జరిపించి తన సహృదయాన్ని చాటుకున్న ధర్మపురి సంజయ్ నీ ఎంత పొగిడినా తక్కువేనని ఆయన అన్నారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యం ప్రసాదించి మునుముందు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టే విధంగా శక్తిని ప్రసాదించా లని కోరుకున్నారు.నూతన దంపతుల జీవితాలు సుఖసంతోషాలు, ప్రేమానురాగా లు, ఆయురారోగ్యాలతో నిండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నా రు. ఈ కార్యక్రమంలో ఆగ్మార్క్ సంస్థల అధినేత శ్రీనివాస్ రెడ్డి, చామల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షుడు నాగేష్ రెడ్డి, నగర డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మాజీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విలీనానికి ముందు మౌలిక సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత తీర్చాలి
- ఉపాధ్యాయ, అధ్యాపకుల సర్వీసు సమస్యలు పరిష్కరించాలి
- ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలి: టీఎస్‌యూటీఎఫ్



జగిత్యాల అర్బన్, నవంబర్ 21 (జనంసాక్షి): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడానికి ముందు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్‌సుందర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జగిత్యాల అర్బన్‌లో నిర్వహించిన సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే క్యాంపస్‌లో నిర్వహించినంత మాత్రాన విద్యార్థుల సంఖ్య పెరగదని, నాణ్యమైన విద్య అందదని పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యపై విశ్వాసం కల్పించాలని సూచించారు. ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని నియంత్రించడం తోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరతను తీర్చాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకుల మధ్య తలెత్తే సర్వీసు సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యారంగంలో కీలక విధాన నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో చర్చించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు డా.టి.శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 21 (జనంసాక్షి): మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. శనివారం వేములవాడ పట్ట ణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది పనితీరు,శాంతి భద్రతలకి తీసుకున్నా చర్యలపై అధికారులతో సమీక్షించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు.రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.వివిధ ప్రాంతాల నుంచి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అయన వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సిఐ వీరప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సింగరేణి ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

23 నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరం

గోదావరిఖని, నవంబర్ 21 (జనంసాక్షి): సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్ పే ఆర్డర్ కాపీ, ఆధార్, బ్యాంకు వివరాలు, ఓటీపీ కోసం సెల్‌ఫోన్ తీసుకురావాలని సూచించారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి) :
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లావుడ్య చవన్ లాల్ రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శనివారం రోజు (21వ తేదీ) ఫిర్యాదుదారుడి ఇంటి వద్ద లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. ఫిర్యాదు దారుడి కోడలికి ‘ చేయూత వితంతు పెన్షన్’ దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసి పెన్షన్ మంజూరు చేయించినందుకు ప్రతిఫలంగా లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. లంచం సొమ్ము రూ.10 వేలు నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపింది. కేసు దర్యాప్తులో ఉంది. లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు తెలిపారు.

నితిన్ నబీన్ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు

లక్ష మందికి పైగా జనసమీకరణ లక్ష్యం : బండి సంజయ్ కుమార్



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):
ఈనెల 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ‘ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం.. అరాచకాన్ని అంతం చేద్దాం’ నినాదంతో నిర్వహించే ఈ పర్యటనలో భాగంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నారు. లక్ష మందికి పైగా ప్రజలు, కార్యకర్తలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కరీంనగర్ గాంధీ విగ్రహం నుంచి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, గడియారం సర్కిల్, శాస్త్రిరోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగనుంది. వైశ్యా భవన్ వద్ద నితిన్ నబీన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ నేతలు పాదయాత్ర మార్గాన్ని పరిశీలించి పోలీసు అధికారులతో భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై చర్చించారు. పాదయాత్రకు వచ్చే వారి కోసం వెయ్యి బస్సులు, రెండు వేల ఆటోలు, వందలాది మినీ బస్సులతో పాటు కార్లను సమకూరుస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్, భోజనం, తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కోరారు.
అనంతరం కొండా సత్యలక్ష్మీ గార్డెన్‌లో పార్లమెంట్ నియోజకవర్గ మండలాధ్యక్షులు, ఇంచార్జీలతో సమావేశమయ్యారు. పర్యటనను దేశవ్యాప్తంగా చర్చనీయాంశం చేసేలా విజయవంతం చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో కరీంనగర్ మారుమోగాలని, కాషాయ జెండాలతో నగరమంతా సందడిగా మారాలని కోరారు. ప్రతి కార్యకర్త పాదయాత్ర పూర్తయ్యే వరకు నితిన్ నబీన్‌తో కలిసి నడవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- రూ.75 లక్షలతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులు ప్రారంభం
- విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి
- చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అవసరం
- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి: ఎమ్మెల్యే డా. సంజయ్



మెట్‌పల్లి, నవంబర్ 21 (జనంసాక్షి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల సూచించారు. మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.75 లక్షలతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను శనివారం ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు నిధులు రూ.40 లక్షలతో రెండు గదులు, జిల్లా కలెక్టర్ నిధులు రూ.35 లక్షలతో మరో రెండు గదులు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ సమయంలో క్రమశిక్షణతో చదువుతూ తమలోని ప్రతిభను వెలికితీయాలని సూచించారు. చదువుతో పాటు మంచి నడవడిక అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సమస్యలు, అవసరాలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, డీఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అలుగునూరులో ఘనంగా దీక్షా దివస్ సభ

నవంబర్ 29న వేలాదిగా తరలిరావాలి.. కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నాం: గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబర్ 21, (జనం సాక్షి) ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నవంబర్ 29న అలుగునూరులో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దీక్షా దివస్ కేవలం పార్టీ కార్యక్రమం కాదని, తెలంగాణ ప్రజల చారిత్రక దినమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం ఉన్నంతకాలం దీక్షా దివస్‌ను పవిత్ర దినంగా నిర్వహిస్తామని ప్రకటించారు. సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నామని, వేలాది మంది హాజరయ్యేలా తాగునీరు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కవులు, కళాకారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తుల ఉమ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా ఆయిల్‌పామ్ తోటల యాజమాన్యం చేపట్టాలి

జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్



మంథని, నవంబర్ 21, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఎలినినో ప్రభావం ఆయిల్ ఫామ్ సాగు పై పంటల మార్పిడి పై శనివారం రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్‌పామ్ సాగు ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ తోటల్లో సమర్థవంతమైన నీటి యాజమాన్యం, సమతుల్య పోషకాల వినియోగం ద్వారా పుష్పాల అభివృద్ధి, గెలల ఏర్పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అలాగే ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అవసరమైన స్లాషర్లు, స్రెడర్లు, మినీ ట్రాక్టర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు బిందు సేద్య పరికరాలపై ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, కోకో సాగుకు కూడా ఉద్యానవన శాఖ ద్వారా రాయితీ సౌకర్యం

మున్సిపల్ మహిళా కార్మికురాలిపై దాడి అమానుషం

- నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- హెచ్ఎంటీ నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన



నాచారం, నవంబర్ 21 (జనంసాక్షి) : నల్లగొండ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య మహిళా కార్మికురాలిపై యజమాని కర్రతో దాడి చేసి, దుర్భాషలాడిన ఘటనను భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. మహిళా కార్మికురాలిపై దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఈఎస్ఐసీ బోర్డు సభ్యుడు వేముల మారయ్య డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ శనివారం రోజున హెచ్ఎంటీ నగర్‌లోని తన కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులపై దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని అన్నారు. మహిళా కార్మికురాలిపై విచక్షణారహితంగా దాడి చేసి అవమానించడం కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. కార్మికులపై దాడులకు పాల్పడే వారిపై నామమాత్రపు కేసులు కాకుండా, నేర తీవ్రతకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే విధులకు హాజరై దుమ్ము, ధూళి, దుర్వాసనను సైతం లెక్కచేయకుండా పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను సమాజం గుర్తించాలని మారయ్య అన్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు విధి నిర్వహణలో తగిన భద్రత, గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మున్సిపల్ కార్మికుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళా కార్మికురాలికి న్యాయం జరిగే వరకు కార్మిక సంఘాల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిదురాల యాకస్వామి, కాప్రా సర్కిల్ అధ్యక్షుడు కురుమన్న, హైదరాబాద్ ఎంటమాలజీ ప్రధాన కార్యదర్శి పరమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగయ్య, నిర్వహణ కార్యదర్శి సోమయ్య, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కార్యవర్గ సభ్యుడు అనిల్, మహిళా నాయకులు పార్వతమ్మ, రాజమణి, ఉప్పలమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- సిఐటీయు జిల్లా కార్యదర్శి బలరాం



నారాయణపేట, నవంబర్ 21 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా లో ఉపాధి కూలీల బిల్లులు మూడు వారాల బిల్లులు గత 5 నెలలుగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాల ని సిఐటీయు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం డిమాండ్ చేశారు శనివారం రోజు నారాయణపేట మండల పరిధిలోని శాసన్పల్లి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాలను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఎలినీనో ప్రభావం వల్ల ఎండలు తీవ్రంగా ఉన్నా యని దీంతో ఉపాధి పనులు ఎంతో కష్టంగా మారిందన్నారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు నీడ, నీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తదితర కనీస సౌకర్యాలు అధికారులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన ఉపాధి కూలీలకు నష్టం కలిగించే వివిజి రాంజీ బిల్లును రద్దు చేయాలని, పాత ఉపాధి హామీ పథకం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజు కూలి 800 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు క్షేత్ర సహాయకుల రాష్ట్ర నాయకులు బి.కాశీనాథ్, జిల్లా నాయకులు ప్రసాద్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆరుట్ల బుగ్గ జాతరకు సర్వం సిద్ధం

- జాతర గోడ పత్రిక ఆవిష్కరణ



రంగారెడ్డి, నవంబర్ 21 (జనంసాక్షి) : మంచాల మండలం ఆరుట్ల శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి వార్షిక జాతర మహోత్సవాల గోడ పత్రికను (పోస్టర్) ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ నెల 24వ తేదీ పౌర్ణమి రోజున ప్రారంభం కానున్న ఈ బుగ్గ జాతరను పురస్కరించుకుని, దేవాలయ కమిటీ చైర్మన్ అనంగల్ల యాదయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల సొసైటీ చైర్మన్ వెదిరె హనుమంతు రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి చిందం శ్రీశైలం, ప్రజాగళం దామర భూపాల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, దేవాలయ కమిటీ సభ్యులు వెదిరె జ్యోతి రమణ రెడ్డి, దసరమోని రమేష్, మనీపాటి వెంకటేష్, ఎనిధుల సురేష్, సపవత్ లచ్చిరాం, బత్తుల రవీందర్ మరియు గ్రామ పెద్దలు గుడ్డిమల్లి చంద్రయ్య, మారగోని మాసయ్య గౌడ్, చిందం ఐలయ్య, పాండాల శ్రీనివాస్, మడపాకుల యాదయ్య, దూసరి రాజు, లొంగారి భాస్కర్ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య..
- రూ.35 లక్షలతో బోర్లు,ఆధునిక మరుగుదొడ్లకు శంకుస్థాపనలు
- ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం



శంకర్‌పల్లి, నవంబర్ 21 (జనం సాక్షి) : మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శ్రీకారం చుట్టారు. శనివారం బీడీఎల్ రోడ్డులోని ఇస్తేమా ప్రాంగణంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన బోర్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనతో పాటు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక మరుగుదొడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీలోని రెండో వార్డు గణేష్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు.సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్,వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు,మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- 7.44 కిలోల గంజాయి, నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్..
- మరో నిందితుడి కోసం గాలింపు



అచ్చంపేట, నవంబర్ 21 (జనం సాక్షి) : అచ్చంపేట పట్టణం, పరిసర గ్రామాల్లో గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గంజాయి, నగదు, మొబైల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు అచ్చంపేట ఎస్ఐ, పోలీసు సిబ్బంది, క్యూస్ టీమ్ సహకారంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిని పట్టణం పరిధికి చెందిన పుట్టపాగ రాజేష్, తండ్రి పి. యాదయ్య, తండ్రి ఎం.డి. రసూల్‌బాబాగా పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి మొత్తం 7.440 కిలోల గంజాయి, నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

7.440 కిలోల గంజాయి స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో 7.440 కిలోల గంజాయి విలువ సుమారు రూ.3.72 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయి విక్రయం ద్వారా వచ్చిన నగదు రూ.21,640, గంజాయి రవాణాకు ఉపయోగించిన నల్లరంగు బజాజ్ పల్సర్ మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించిన వస్తువులు, ఒక ఎలక్ట్రానిక్ తూకం యంత్రం, 52 ఖాళీ పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు గంజాయిని కొనుగోలు చేసి ప్యాకెట్లుగా తయారు చేసి పరిసర గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. గతంలో కూడా గంజాయి విక్రయాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.

తడి భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, నవంబర్ 21 (జనం సాక్షి) : జిల్లాలోని తడి భూముల పరిరక్షణ, అభివృద్ధి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం మెదక్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వెట్‌ల్యాండ్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జిల్లాలోని తడి భూముల (వెట్‌ల్యాండ్స్) పరిరక్షణ, అభివృద్ధి, నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ...వెట్‌ల్యాండ్స్ యొక్క పర్యావరణ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వాటిని కాలుష్యం బారిన పడకుండా సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. తడి భూముల ఆక్రమణలను అరికట్టడంతో పాటు, నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వెట్‌ల్యాండ్స్ పరిసర ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిబంధనల ప్రకారం వాటి నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి హాజరుకాని ఇరిగేషన్ శాఖ అధికారికి మెమో ఇవ్వాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు రిపోర్ట్ పంపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ఇరిగేషన్ శాఖ అధికారులు, అటవీ శాఖ సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



హైదరాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి) : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. శనివారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఘాపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.మురళీధర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల, రికార్డులు, పరిశుభ్రతను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గర్భిణులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను వందశాతం సకాలంలో పూర్తి చేయాలని, వ్యాక్సిన్ల నిల్వ, శీతలీకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హై-లెవల్ వంతెనలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- వర్షాకాలంలో రాకపోకల కష్టాలకు శాశ్వత పరిష్కారం
- వెంకిర్యాల, ఉత్తరాస్‌పల్లి, టేకులపల్లి వంతెనలు అందుబాటులోకి
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు



కొందుర్గు, నవంబర్ 21 (జనంసాక్షి) : కొందుర్గు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది. మండల పరిధిలోని వెంకిర్యాల, ఉత్తరాస్ పల్లి మరియు టేకులపల్లి మార్గాల్లో నూతనంగా నిర్మించిన మూడు హై-లెవల్ బ్రిడ్జిలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా ప్రారంభించారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగులు పొంగిపొర్లడంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో మూడు హై-లెవల్ వంతెనలను నిర్మించింది. వంతెనల ప్రారంభంతో తమ ప్రాంత అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, తమ చిరకాల కోరిక నెరవేరిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, అధికారులు మరియు పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి ఆరోపణలపై మీడియా ఆగ్రహం



ఇబ్రహీంపట్నం, నవంబర్ 21 (జనం సాక్షి) : బొంగుళూరులోని శ్రీ చైతన్య కళాశాలలో చోటుచేసుకున్న లాఠీచార్జి ఘటన వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనలో ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ వ్యవహరించిన తీరుపై జర్నలిస్టులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లాఠీచార్జి సమయంలో వార్తా సేకరణ చేస్తున్న జర్నలిస్టులపై ఏసీపీ ప్రదీప్ కుమార్, ఆయన సిబ్బంది దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా టి.యు.డబ్ల్యూ.జే (హెచ్ 143) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యక్షులు హనుమంతు సుదర్శన్ మాట్లాడుతూ, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజల పట్ల, మీడియా ప్రతినిధుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ఏసీపీ ప్రదీప్ కుమార్ జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.యు.డబ్ల్యూ.జే (హెచ్ 143) తెంజు అధ్యక్షులు వరికుప్పల అశోక్, ప్రధాన కార్యదర్శి ఆముదాల సందీప్, బస్వాపురం దశరథ, మహేష్ చారి, రామ్ చందర్,నరేందర్, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.400 కోట్ల హెచ్ఎండీఏ భూమిని కాపాడాలి



శంషాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి) : కొత్వాల్‌గూడ 119వ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 626/1లో ఉన్న ప్రభుత్వ హెచ్ఎండీఏ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. సుమారు రూ.400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో కొంతమేర ఇప్పటికే ఆక్రమణకు గురైందని, ఆక్రమించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు మిగిలిన భూమిని పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షులు మురళిగౌడ్, హరికృష్ణ, గూడెపు అశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, యువజన అధ్యక్షుడు జివిపి సాగర్, దీపక్ గౌడ్, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివ, శ్యామ్, సోషల్ మీడియా ప్రతినిధి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



అచ్చంపేట, నవంబర్ 21 (జనం సాక్షి) : నియోజకవర్గంలో ఈ నెల 26వ తేదీన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం అచ్చంపేట పట్టణంలోని వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం విస్తీర్ణం, ప్రజలు కూర్చునేందుకు అవసరమైన సదుపాయాలు, వాహనాల పార్కింగ్, వీఐపీల ప్రత్యేక పార్కింగ్, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అచ్చంపేట నియోజకవర్గానికి విచ్చేసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలకు వేదిక కానుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, అచ్చంపేట డిఎస్పీ పి శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 నవంబర్ 2026



ఫోటో జర్నలిస్టులు చరిత్రకు సాక్షులు

ఒక్క ఫొటో వేల భావాలను పలికిస్తుంది

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి) : ఫోటో జర్నలిస్టులు చరిత్రను చూపించడమే కాకుండా ఒక్క ఫొటోతో చరిత్రను శాశ్వతం చేస్తారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక ఫొటో వెయ్యి పదాలతో సమానమని, ప్రభుత్వాలను ఆలోచింపజేసి, సమాజంలో మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పనిచేసే ఫోటో జర్నలిస్టులు యోధులని కొనియాడారు. ఏఐ, మార్ఫింగ్, నకిలీ చిత్రాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ కొత్త సాంకేతికతను అందిపుచ్చు కోవాలని సూచించారు. ఫోటో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు భాజా విరాహత్ అలీ ఫోటో జర్నలిస్టుల ఐక్యత, వృత్తిపరమైన నైపుణ్యాల ప్రాధాన్యాన్ని వివరించారు. పోటీల్లో డెక్కన్ క్రానికల్‌కు చెందిన కే. దుర్గారావు ప్రథమ, సాక్షి నల్గొండకు చెందిన కె. భజరంగ ప్రసాద్ ద్వితీయ, ఈనాడు సంగారెడ్డికి చెందిన పొన్న శ్రీనివాస్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

దంపతుల జీవితాల్లో ఐవీఎఫ్ వెలుగులు

జిల్లాలకూ ఉచిత ఐవీఎఫ్ సేవలు

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్ (జనంసాక్షి) : సంతానం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దంపతుల జీవితాల్లో గాంధీ ఆస్పత్రి ఐవీఎఫ్ కేంద్రం కొత్త వెలుగులు నింపుతోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్న ఐవీఎఫ్ చికిత్స ద్వారా ఎంతోకాలంగా సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు పిల్లలు జన్మించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ మేరకు గాంధీ ఐవీఎఫ్ కేంద్రం వైద్యులు, సిబ్బందిని అభినందిస్తూ శనివారం ఆయన ట్వీట్ చేశారు. వరంగల్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ముగ్గురు దంపతులు గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ చికిత్స పొందడం ద్వారా సంతాన భాగ్యం పొందారని మంత్రి వెల్లడించారు. వీరిలో కొందరు తొమ్మిదేళ్ల నుంచి 16 ఏళ్ల వరకు పిల్లల కోసం ఎదురుచూసిన వారు ఉన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ సంతానం కలగని దంపతులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్న ఐవీఎఫ్ చికిత్స ఎంతో ఊరటనిస్తోందని మంత్రి అన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు మగ శిశువులు..

తొమ్మిదేళ్లుగా సంతానం కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళ ఐవీఎఫ్ చికిత్స అనంతరం ఒకే కాన్పులో ముగ్గురు మగ శిశువులకు జన్మనిచ్చినట్లు మంత్రి గుర్తుచేశారు. 32 వారాలకే ముందస్తు ప్రసవం జరగడంతో శిశువులకు నెలలపాటు వైద్యులు ప్రత్యేక వైద్య సేవలు అందించారని తెలిపారు. అనంతరం శిశువులు సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ విజయాల వెనుక నిరంతరం శ్రమించిన గాంధీ ఆస్పత్రి వైద్యులు, ఐవీఎఫ్ నిపుణులు, ఎంబ్రియాలజిస్టులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అంకితభావంతో, మానవీయ దృక్పథంతో సేవలందిస్తున్న వైద్య బృందం కృషి ప్రశంసనీయమని అన్నారు.

జిల్లాలకూ ఐవీఎఫ్ సేవల విస్తరణ..

ఆర్థిక ఇబ్బందులు సంతాన సాఫల్యానికి అడ్డంకిగా మారకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఫెర్టిలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గాంధీ, పేట్లబురుజు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, దశలవారీగా జిల్లాలకు కూడా ఈ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను కల్పిస్తూ పేద కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్సలను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.



ఏఐసీసీ నిశిత పరిశీలన

- పార్టీలైన్ దాటి మాట్లాడితే చర్యలు
- టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందని వ్యాఖ్యానించిన ఆయన, వారి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్, పార్టీ లైన్ దాటి మాట్లాడే వారి విషయంలో క్రమశిక్షణ చర్యల అంశంపై ఏఐసీసీ స్పందిస్తుందని తెలిపారు. “గతంలో కొండా సురేఖ విషయంలో కూడా మొదటిసారే చర్యలు తీసుకోలేదు. ముందుగా పలుమార్లు హెచ్చరించాం. అయినా తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది” అని వివరించారు. పార్టీలో క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని, దేనికైనా సరైన సమయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర నీటి వాటాల అంశంపై స్పందిస్తూ, తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో ఒక్క బొట్టును కూడా వదులుకోబోమని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. తెలంగాణ జల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేయాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేయడంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందే ఉంటుందని, కానీ ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఎప్పుడూ తెలంగాణ బాగును కోరుకోవని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.

నమ్కీన్ తయారీలో నిబంధనలకు తిలోదకాలు!

గడువు తేదీలు లేకుండానే ఆహార పదార్థాల విక్రయం ?

- అపరిశుభ్రత మధ్య నమ్కీన్ తయారీ
- తిమ్మాయిపల్లిలో నమ్కీన్ కేంద్రంపై పోలీసుల తనిఖీలు
- పలు రకాల ఆహార పదార్థాలు స్వాధీనం.. కేసు నమోదు

కీసర, నవంబర్ 21 (జనంసాక్షి) : తయారీ తేదీ లేదు.. గడువు తేదీ లేదు.. పరిశుభ్రతా ప్రమాణాలూ కనిపించలేదు అయినా ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు కొనసాగుతున్నట్లు పోలీసుల తనిఖీల్లో వెలుగుచూసింది. కీసర మండలం తిమ్మాయిపల్లి శివారులోని శ్రీ కరణిమాతా నమ్కీన్ తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి పలు రకాల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులో ఉన్న నమ్కీన్ తయారీ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు తయారు చేసి, విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ అనిల్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. పోలీసు సిబ్బంది, ఇద్దరు పంచ సాక్షులతో కలిసి కంపెనీని పరిశీలించారు. అక్కడ అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు, ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలు ముద్రించనట్లు గుర్తించారు. విచారణలో హైదరాబాద్ నుంచి తక్కువ నాణ్యత కలిగిన ముడి సరుకులు కొనుగోలు చేసి, ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలు ముద్రించకుండా విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారని పోలీసులు వెల్లడించారు. ఒక్కో ప్యాకెట్‌పై సుమారు రూ.30 లాభం పొందుతున్నట్లు విచారణలో పేర్కొన్నారని తెలిపారు.



తనిఖీల్లో 4 అర కిలో చకోడి ప్యాకెట్లు, 5 కిలో బూందీ ప్యాకెట్లు, 5 కిలో మిక్చర్ ప్యాకెట్లు, 5 కిలో రత్లామి సేవ్ ప్యాకెట్లు, 5 బాలాజీ పాపడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి సరుకును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యతా వివరాలను పరిశీలించాలని పోలీసులు సూచించారు. వివరాలు లేని ప్యాకెట్లను కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఐలాపూర్ తండాలో ప్రభుత్వ భూములపై అధికారుల కొరడా

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం.. 50 బేస్‌మెంట్లు, 25 ఇళ్ల కూల్చివేత

- ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదని అధికారుల హెచ్చరిక

అమీన్‌పూర్, నవంబర్21 (జనంసాక్షి) : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వెంటకటేశం హెచ్చరించారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ తండాలో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై శనివారం భారీ ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశం ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉదయం నుంచే ఐలాపూర్ తండాకు చేరుకుని కూల్చివేతల ప్రక్రియను ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ చర్యల్లో భాగంగా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన 50 బేస్‌మెంట్లను, 25 ఇళ్లను జేసీబీల సహాయంతో అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎవరూ అక్రమ లేఅవుట్లు లేదా ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ లలిత శ్రావణి, రెవెన్యూ సిబ్బందితో పాటు, అమీన్‌పూర్ మున్సిపల్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



ఏసీబీ వలకు చిక్కిన విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్

రూ.30 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత

హైదరాబాద్ (జనంసాక్షి) : విద్యుత్ చౌర్యం కేసులో తదుపరి చర్యలు తీసుకోకుండా రూ.30 వేలు లంచం తీసుకున్న విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీనగర్ సెక్షన్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న జి. సంతోష్ ఆనంద్ ను ఫిర్యాదుదారుడు విద్యుత్ చౌర్యం కేసులో చర్యలు తీసుకోవద్దని కోరాడు. దీంతో సబ్ ఇంజినీర్ రూ.50 వేలు డిమాండ్ చేసి రూ.35 వేలకు తగ్గించాడు. ఫిర్యాదుదారుడు ఏసీబీని సంప్రదించగా శనివారం ఫిర్యాదుదారుడు ఇంటి వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మాటువేసి పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.



రాజేంద్రనగర్ ఓఆర్ఆర్‌పై నాలుగు కార్లు ఢీ

- బ్లాస్టింగ్ పనులతో రోడ్డుపై రాళ్లు.. పలువురికి గాయాలు

రాజేంద్రనగర్, నవంబర్ 21 (జనంసాక్షి) : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం నాలుగు కార్లు వరుసగా ఒకదానికొకటి ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడగా, ఇద్దరికి కాళ్లు ఫ్రాక్చర్ అయినట్లు, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం, ఓఆర్ఆర్‌పై ఈకో పార్క్ సమీపంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. దీంతో రాళ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న వాహనాలు ఒక్కసారిగా నెమ్మదించాయి. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ముందు ఉన్న కారును ఢీకొట్టడంతో వరుసగా నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు కార్లు భారీగా దెబ్బతినడంతో కొంతమంది ప్రయాణి కులు వాహనాల్లో చిక్కుకుపోయారు. స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను బయటకు తీసి అంబులెన్సుల ద్వారా సమీప ఆసుపత్రు లకు తరలించారు. ఈ ప్రమాదంతో ఓఆర్ఆర్‌పై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచా రం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. దెబ్బతిన్న వాహనాలను రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



పైరసీ ముఠా గుట్టురట్టు

ఇద్దరు విద్యార్థుల అరెస్టు

హైదరాబాద్ (జనంసాక్షి) : కొత్తగా విడుదలయ్యే సినిమాలను థియేటర్లలో రహస్యంగా చిత్రీకరించి ఆన్‌లైన్‌లో లీక్ చేస్తున్న పైరసీ ముఠా గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఇద్దరు యువ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితులను కర్నూలుకు చెందిన షేక్ రిజ్వాన్ (19), రాంపోగు అజయ్ (19)లుగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కర్నూలులోని ఎస్‌వీసీ సినిమాస్ థియేటర్‌లో కొత్త సినిమాలు విడుదలైన వెంటనే మొబైల్ ఫోన్ల సాయంతో గుట్టుచప్పుడు కాకుండా రికార్డ్ చేసి పైరసీ ముఠాలకు చేరవేస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిందితులు సాధారణ బ్యాంకు లావాదేవీలకు బదులుగా క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు తీసుకుంటున్నారు. ఒక్కో కొత్త సినిమాను రికార్డు చేసి పంపినందుకు వారికి రూ. 20 వేల చొప్పున కమిషన్ అందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నల్లమలలో గంజాయి ముఠా గుట్టురట్టు

అచ్చంపేట (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపల్ కేంద్రంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి కీలక చర్యలు చేపట్టారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులతో పాటు మరో తొమ్మిది మంది గంజాయి సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని, నిందితుల నుంచి 7.440 కిలోల గంజాయి, రూ.21,640 నగదు, పల్సర్ బైక్, మూడు మొబైళ్లు, ప్యాకింగ్ మెషిన్, తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను అచ్చంపేట డీఎస్పీ శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. న్యూ బస్‌స్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఎం.డి. రసూల్ బాషా (26), పుట్టసాగ రాజేష్ (26)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.3,72,000 విలువైన 7.440 కిలోల గంజాయితో పాటు నగదు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల గ్రామానికి చెందిన హరి అనే వ్యక్తి వద్ద కిలో గంజాయిని రూ.5 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడైంది. అనంతరం గంజాయిని ఐదు గ్రాముల చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి, ఒక్కో ప్యాకెట్‌ను రూ.500కు అచ్చంపేటలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంపై క్రైమ్ నంబర్ 305/2026 కింద కేసు నమోదు చేశారు. మరోవైపు పట్టణంలోని వై జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక భాగాన గంజాయి సేవిస్తున్న తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నామన్నారు. వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షల్లో ఽనజ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిపై క్రైమ్ నంబర్ 304/2026 కింద కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిలో నాగరాజు గౌడ్, శివ, వెంకట్, అజయ్, షాహిద్, మహేష్, బాలరాజు, చంటి, రామన్న ఉన్నారు.



యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం జీవితాలను నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ బాలస్వామి పాల్గొన్నారు.

సిరాజ్‌ది అద్భుత పోరాట పటిమ

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్ (జనంసాక్షి) : భారత టెస్ట్ క్రికెట్ జట్టు నుంచి హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ ను తప్పించడంపై విపక్ష జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ ఆరోపణల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. సిరాజ్ అద్భుత పోరాట పటిమను కొనియాడిన ఒవైసీ, అతను కచ్చితంగా తిరిగి జట్టులోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశారు.మహమ్మద్ సిరాజ్ హైదరాబాద్‌లోని ఒక పేద కుటుంబం నుంచి వచ్చాడని, ఒక ఆటో రిక్షా డ్రైవర్ కుమారుడైన అతను ఎంతో కష్టపడి ఈ స్థాయికి ఎదిగాడని ఒవైసీ గుర్తుచేశారు. సిరాజ్ చేసిన త్యాగాలు, అనుభవించిన కష్టాలు ప్రపంచానికి తెలియకపోవచ్చు కానీ, తన సొంత కృషి, పట్టుదల మరియు అకుంఠిత సంకల్ప బలంతో భారత క్రికెట్ జట్టు తరపున ఎన్నో టెస్టు మ్యాచ్‌లు ఆడి 144 టెస్ట్ వికెట్లు పడగొట్టాడని ప్రశంసించారు.

సిరాజ్‌కు ఉన్న అతిపెద్ద బలం అతని సంకల్ప బలమేనని, అతడిని అణచివేయడం గానీ లేదా ఎక్కువ కాలం పక్కన పెట్టడం గానీ అంత సులభం కాదని ఒవైసీ స్పష్టం చేశారు. సిరాజ్ ఒక నిజమైన యోధుడు అని, అతను కచ్చితంగా తిరిగి జట్టులోకి పునరాగమనం చేస్తాడని పేర్కొన్నారు. ఆటతో పాటు సిరాజ్ వ్యక్తిత్వం, నిరాడంబరత ఎంతో ఆదర్శనీయమని, అతను తిరిగి జట్టులోకి వచ్చి సుదీర్ఘకాలం భారత క్రికెట్ జట్టుకు సేవలందిస్తూ మరిన్ని గొప్ప విజయాలు సాధిస్తాడని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

జిల్లా ప్రజా ప్రతినిధులు



మహబూబాబాద్, నవంబర్ 21 (జనం సాక్షి): హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీ.వీ ఆనంద్ ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై డీజీపీతో చర్చించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖ పనితీరు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370